www.udyamakeratam.com
PRGI No. : TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 106 | 3-10-2026 | శనివారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

## ఇద్దరు పాక్ చొరబాటుదారుల కాల్చివేత

కాల్చి చంపిన బీఎస్ఎఫ్ బలగాలు

చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన బీఎస్ఎఫ్

4



## గాంధీ స్మృతిలో ప్రధాని మోదీ

### గాంధీజీ, లాల్ బహదూర్‌లకు ఘన నివాళులు!

గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని 'గాంధీ స్మృతి' వద్ద నిర్వహించిన ప్రత్యేక సర్వధర్మ ప్రా ర్థనా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహా త్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గాంధీజీ బోధించిన సత్యం, శాంతి, అహింసా సిద్ధాంతాలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని ప్రధాని స్మరించుకున్నారు.

4



## ఏనుగు దంతాల స్మగ్లింగ్..

- డీఆర్ఐ వలలో వన్యప్రాణుల అక్రమ రవాణా ముఠా
- నిందితుల నుంచి 17 కిలోల బరువున్న నాలుగు ఏనుగు దంతాలు స్వాధీనం

.. వివరాలు 2లో



## డిసెంబర్ 9 నుంచి సర్కారు బడుల్లో బ్రేక్‌ఫాస్ట్!



### హరేకృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్, చైన్ ల్యాబ్స్ తో ఒప్పందాలు

- రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి కేంద్రీకృత వంటశాలల ప్రారంభం
- నవంబర్ 30లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- ఆహార నాణ్యతపై నిరంతర నిఘా.. కమాండ్ కంట్రోల్ కేంద్రంతో అనుసంధానం
- విద్యార్థుల శారీరక ఎదుగుదల, విద్యా పురోగతిపై ప్రత్యేక రికార్డు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్ వంటశాలలకు రూ.9.17 కోట్ల సహకారం

"రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాబోయే డిసెంబర్ 9వ తేదీ నుంచి ఉపాహారం (బ్రేక్‌ఫాస్ట్) అందించే బృహత్తర పథకాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఈ మేరకు డిసెంబర్ 9 నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్లను ప్రారంభించి, విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ పథకానికి అవసరమైన సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటు పనులన్నింటినీ నవంబర్ 30 తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థల ప్రతినిధులు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుని, రూ. 9.17 కోట్ల విరాళాల చెక్కులను సీఎం సమక్షంలో అందజేశారు."

**హైదరాబాద్, అక్టోబర్ 2 (ఉద్యమ కెరటం):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయపు భోజనం అందించే కార్యక్రమాన్ని డిసెంబర్ 9 నుంచి విస్తృతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న కేంద్రీకృత వంటశాలలను డిసెంబర్ 9న ఒకేసారి ప్రారంభించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అన్ని వంటశాలల పనులను నవంబర్ 30లోగా పూర్తి చేయాలని గడువు విధించారు. హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులతోపాటు జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థల ప్రతినిధులు జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో

మిగతా 2 లో



## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

- 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు
- కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమ త్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగా వాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

2

## భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు



### కిలోమీటర్‌కు రూ.15 చొప్పున పెంపు

- తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30
- పెంచిన ధరలు నేటి నుంచే అమల్లోకి
- లగేజీపై కూడా అదనపు చార్జీలకు అనుమతి

2

ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఊరట కల్పించింది. ఆటో ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు రేవంత్ సర్కార్ శుక్రవారం జీవో జారీ చేసింది. కనీస చార్జీని రూ.20 నుంచి రూ.30కి పెంచుతున్నట్లు జజీవోలో పొందుపర్చింది. ప్రతీ కిలోమీటర్‌కు రూ.11 నుంచి రూ.14కి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇక టిటెన్షన్ చార్జి 50 పైసల నుంచి 75 పైసలకు పెంచగా.. లగేజీ ఛార్జీ 25 పైసల నుంచి 50 పైసలకు పెంచారు.



## 'సర్' విచారణ మీ ఇంటి వద్దే..

కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన ఈసీ

ఓటుకు భద్రత కల్పించేలా నిర్ణయం

2



## నేను పోటీలో ఉన్నా..

తప్పుడు ప్రచారాలను నమ్మకండి

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

.. వివరాలు 3లో

## 4న రాష్ట్రానికి అమిత్ షా రాక



- తూప్రాన్‌లో అమూల్ డెయిరీ ప్లాంట్ ప్రారంభోత్సవం
- సబర్ డెయిరీ ప్రాజెక్టుకు భూమి పూజ
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

3



## ఇకపై అన్ని సబ్జెక్టులకు ప్రాక్టికల్స్!?

సిలబస్‌తో పాటు మారిన మార్కుల విధానం

2

## మహాత్ముడికి నివాళులు

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా లంగర్ హౌస్‌లోని బాపూ ఘాట్‌లో ఆయనకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు ఘన నివాళు లర్పించారు. గాంధీ చూపిన అహింస, సత్యాగ్రహంలను, దేశానికి ఆ మహనీయుడు అందించిన సేవలను స్మరించుకున్నారు.





## గాంధీయిజమే మార్గదర్శకం

గాడ్సే భావజాలాన్ని వ్యతిరేకించాలి

గాంధీ సిద్ధాంతాల స్ఫూర్తితోనే ప్రజా పాలన

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

.. వివరాలు 3లో

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శనివారం
3 అక్టోబర్ 2026



## ఇకపై అన్ని సబ్జెక్టులకు ప్రాక్టికల్స్!?

### సిలబస్‌తో పాటు మారిన మార్కుల విధానం

**హైదరాబాద్, అక్టోబర్ 2 (ఉద్యమ కెరటం):** తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరం (2026-27) నుంచి ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థులకు బోర్డు కీలక మార్పులు తీసుకొచ్చింది. చదువుకునే సిలబస్‌తో పాటు పరీక్షల విధానంలోనూ సమూల మార్పులు చేశారు. ఇప్పటివరకు కేవలం కొన్ని సబ్జెక్టులకే పరిమితమైన ప్రాక్టికల్స్‌ను.. ఇప్పుడు అన్ని సబ్జెక్టులకు (ఇంటర్నల్ అసెస్‌మెంట్ రూపంలో) ప్రవేశపెట్టారు. ఈ కొత్త విధానంపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. కొత్త విధానం ప్రకారం మొత్తం మార్కుల్లో రాత పరీక్షకు 80 శాతం, ప్రాక్టికల్స్‌కు 20 శాతం మార్కులను కేటాయించారు. ఒకవేళ ఎగ్జామ్ 80 మార్కులకు ఉంటే, విద్యార్థులు పాస్ కావాలంటే కనీసం 28 మార్కులు (35 శాతం) సాధించాల్సి ఉంటుంది. అలాగే ప్రాక్టికల్స్‌కు కేటాయించిన 20 మార్కులలో కనీసం 7 మార్కులు వస్తేనే పాసైనట్లు లెక్క. సైన్స్ సబ్జెక్టుల విషయానికి వస్తే.. గతంలో కేవలం సెకండియర్‌లోనే ప్రాక్టికల్స్ ఉండేవి. కానీ, ఇకపై ఫస్టియర్‌లో సగం, సెకండియర్‌లో మరో సగం చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఇంగ్లీష్ సబ్జెక్ట్ విషయంలోనూ బోర్డు స్పష్టతనిచ్చింది. ఫస్టియర్ విద్యార్థులకు ఒకే ఒక పాఠ్య పుస్తకం ఉంటుంది. ఇక సెకండ్ ఇయర్లో టెక్స్ట్ బుక్‌తో పాటు ప్రత్యేకంగా 'ఇంగ్లీష్ ప్రాక్టికల్ మాన్యువల్' కూడా అందుబాటులో ఉంటుంది. ఈ కొత్త మార్పులు, సిలబస్ వివరాలు, సబ్జెక్టుల వారీగా మార్కుల కేటాయింపు వంటి సమస్త సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్ లో పొందుపరిచామని బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ తెలిపారు. ఈ కొత్త పరీక్షా విధానంపై విద్యార్థులకు ఎటువంటి గందరగోళం లేకుండా చూడాల్సిన బాధ్యత కళాశాలల యాజమాన్యాలపై ఉంది. ఏ సబ్జెక్టుకు ఎన్ని మార్కులు ఉంటాయి, పాస్ మార్కులు ఎలా లెక్కగడతారు అనే పూర్తి వివరాలను ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు విద్యార్థులకు చక్కగా అర్థమయ్యేలా వివరించాలని బోర్డు ఆదేశించింది. కాబట్టి విద్యార్థులందరూ ఈ కొత్త విధానాన్ని గమనించి అందుకు తగ్గట్టుగా చదువులో విజయం సాధించాలి.

## భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

### కిలోమీటర్‌కు రూ.15 చొప్పున పెంపు

### తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30

### పెంచిన ధరలు నేటి నుంచే అమల్లోకి

### లగేజీపై కూడా అదనపు చార్జీలకు అనుమతి

**హైదరాబాద్, , అక్టోబర్ 2 (ఉద్యమ కెరటం):** ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఊరట కల్పించింది. ఆటో ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు రేవంత్ సర్కార్ శుక్రవారం జీవో జారీ చేసింది. కనీస చార్జీని రూ.20 నుంచి రూ.30కి పెంచుతున్నట్లు జజీవోలో పొందుపర్చింది. ప్రతీ కిలోమీటర్‌కు రూ.11 నుంచి రూ.14కి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇక టిటెన్షన్ చార్జి 50 పైసల నుంచి 75 పైసలకు పెంచగా.. లగేజీ ఛార్జీ 25 పైసల నుంచి 50 పైసలకు పెంచారు. ఇక గరిష్ట లగేజీ పరిమితి 100 కిలోలుగా కొనసాగించారు. ఇక రాత్రి సమయాల్లో ఛార్జీలపై 1.5 రెట్లు కొనసాగించారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఆటో ఛార్జీలను ప్రభుత్వం సవరించింది.కొత్త ఆటో ఛార్జీల అమలు కోసం మీటర్ల రీసెట్టింగ్‌కు ప్రభుత్వం 3 నెలల గడువు విధించింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఒకటిన్నర శాతం అదనపు ఛార్జీలు వసూలు చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. మూడు నెలల్లోగా ఆటో డ్రైవర్లు డిజిటల్ మీటర్లను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఆటో ఛార్జీలను అధికారికంగా ధృవీకరిస్తూ జీ.ఒ. 46 జారీ చేసింది. ఈ చార్జీలు తక్షణమే అమల్లో వస్తాయని వెల్లడించింది. ఇక ట్రాఫిక్ లేదా ఇతర కారణాల వల్ల ఆటో ఆగినప్పుడు నిమిషానికి 75 పైసలు చొప్పున వెయిటింగ్ ఛార్జీ ఖరారు చేశారు. రాత్రి సమయాల్లో ప్రయాణించేవారు సాధారణ ఛార్జీల కంటే అదనంగా 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇక ప్రయాణికులు ఆటోలో తమ వెంట హ్యాండ్ బ్యాగ్, బ్రీఫ్ కేస్ వంటికి ఉచితంగా తీసుకెళ్లవచ్చు. ఇతర పెద్ద లగేజీలు తీసుకెళ్లాలంటే కిలోమీటర్‌కు 50 పైసలు చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.ఆటోలో తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30గా ఫిక్స్ చేశారు. ఆ తర్వాత ప్రతీ అదనపు కిలోమీటర్‌కు రూ.15 చొప్పున ఖరారు చేశారు. ఇక కొత్త ధరలపై ఆటోల్లో ఫేర్ కార్డులను ఏర్పాటు చేయాలని డ్రైవర్లను ప్రభుత్వం ఆదేశించింది. కాగా ఆటో ఛార్జీలను పెంచాలని డ్రైవర్ల సంఘాలు ఇటీవల సమ్మెకు పిలుపునిచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆటోలను నిలిపివేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీంతో ప్రభుత్వం దిగొచ్చి ఆటో సంఘాలతో చర్చలు జరిపింది. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ఆటో డ్రైవర్లు సమ్మెపై వెనక్కి తగ్గారు. ఈ క్రమంలో ఆటో ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. అలాగే డ్రైవర్ల సంక్షేమ కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసే పనిలో ప్రభుత్వం ఉంది. అయితే ఛార్జీల పెంపు వల్ల డ్రైవర్లకు ప్రయోజనం చేకూరనుండగా సామాన్యులకు భారమనే చెప్పుకోవచ్చు.



# డిసెంబర్ 9 నుంచి సర్కారు బడుల్లో బ్రేక్‌ఫాస్ట్!

మొదటి పేజీ తరువాయి

బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం అమలుకు అవసరమైన కేంద్రీకృత వంటశాలల ఏర్పాటుపై ఈ సందర్భంగా చర్చించారు. నాగర్‌కర్నూల్‌లో ఆధునిక కేంద్రీకృత సామూహిక వంటశాల ఏర్పాటు కోసం జున్నా సోలార్ సిస్టమ్స్ రూ.5.17 కోట్ల సహకారం అందించింది. సంస్థ సీఎండీ శేఖర్‌రెడ్డి, సీఈఓ అనిల్‌బాబు ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందించారు. వికారాబాద్‌లో కేంద్రీకృత వంటశాల నిర్మాణానికి చైన్ ల్యాబ్స్ ఇండియా రూ.4 కోట్ల సహకారం అందించింది. సంస్థ ప్రతినిధి డి.సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్‌కుమార్ చెక్కును అందజేశారు. బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమానికి సహకరించేందుకు ముందుకొచ్చిన రెండు సంస్థల ప్రతినిధులను రేవంత్‌రెడ్డి అభినందించారు. విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ మెనూ ఉండాలని సూచించారు. ఆహార పదార్థాల్లోని కేలరీలను లెక్కించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. బ్రేక్‌ఫాస్ట్ వల్ల



విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకునే అవకాశం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల శారీరక ఎదుగుదలతోపాటు విద్యా పురోగతిని ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ ప్రత్యేక ట్రాక్ రికార్డు నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రీకృత వంటశాలలను కమాండ్ కంట్రోల్ కేంద్రంతో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని, విద్యార్థులు స్వయంగా వంటశాలలను సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్రీకృత వంటశాలలను డిసెంబర్ 9న ప్రారంభించాలన్న నిర్ణయాన్ని తాజా నివేదికలు కూడా ధ్రువీకరిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్‌తోపాటు వివిధ సంస్థల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

### 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు

### కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా

**హైదరాబాద్, అక్టోబర్ 2 (ఉద్యమ కెరటం):** తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉ ందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# 'సర్' విచారణ మీ ఇంటి వద్దే..

### కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన ఈసీ

**హైదరాబాద్, అక్టోబర్ 2 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలను ఇచ్చింది. ఓటర్లకు నష్టం జరగకుండా, ఇబ్బంది కలగకుండా వారి ఓటుకు భద్రత కల్పించేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను వోటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తాజాగా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సీఈఓ సి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా వోటర్లను నోటీసులు అందుకోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు వోటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు.ఇకపై సాధారణంగా వోటర్లను విచారణ కోసం కార్యాలయాలకు పిలవరాదని సీఈఓ తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త వోటరు నమోదు కోసం ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ స్పష్టం చేశారు.



ఎస్ఐఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపోయినప్పటికీ తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం-6, ఫారం-7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. వోటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఫారం-6, పెండింగ్ నోటీసులు, ఫారం-7, ఫారం-8కు సంబంధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని సీఈఓ ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దశను పారదర్శకంగా పూర్తి చేయాలని సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ఇక తాజా ఆదేశాలతో విచారణకు రాని వారి ఇళ్ళకు నేరుగా బీఎల్ వోలు వెళ్లి కావాల్సిన డాక్యుమెంట్స్ తీసుకోవాలని సూచించారు.

# ఏనుగు దంతాల స్మగ్లింగ్.. ముగ్గురు అరెస్ట్

- డీఆర్ఐ వలలో వన్యప్రాణుల అక్రమ రవాణా ముఠా
- నిందితుల నుంచి 17 కిలోల బరువున్న నాలుగు ఏనుగు దంతాలు స్వాధీనం
- దంతాలతో తయారు చేసిన ఐవరీ ట్రోఫీలు కూడా పట్టివేత
- విక్రయించే సమయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
- దంతాల మూలం, అక్రమ నెట్‌వర్క్‌పై కొనసాగుతున్న దర్యాప్తు

**హైదరాబాద్, అక్టోబర్ 2:** నగరంలో ఏనుగు దంతాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు 17 కిలోల బరువున్న నాలుగు ఏనుగు దంతాలతో పాటు వాటితో తయారు చేసిన ఐవరీ ట్రోఫీలను స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో నిఘా పెట్టిన అధికారులు.. దంతాలను విక్రయిస్తున్న సమయంలో నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.





స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాలను వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 నిబంధనల ప్రకారం సీజ్ చేసినట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. దంతాలు ఎక్కడి నుంచి వచ్చాయి, వీటి వెనుక ఉన్న నెట్‌వర్క్ ఎవరు, అక్రమ లావాదేవీల్లో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఏనుగు దంతాల వ్యాపారం, వాటితో తయారు చేసిన వస్తువుల విక్రయాలు, కొనుగోళ్లు చట్టవిరుద్ధమైనవని అధికారులు స్పష్టం చేశారు. వన్యప్రాణుల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో డీఆర్ఐతో పాటు అటవీ, వన్యప్రాణి సంరక్షణ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఏనుగుల వేట, ముఖ్యంగా దంతాల కోసం అక్రమంగా వాటిని హతమార్చడం వన్యప్రాణుల మనుగడతో పాటు పర్యావరణ సమతుల్యతపై ప్రభావం చూపుతుంది. దంతాలు లేదా ఇతర వన్యప్రాణి ఉత్పత్తుల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే అటవీ శాఖ లేదా పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు.

# గాంధీయిజమే ప్రపంచానికి మార్గదర్శకం

- గాడ్సే భావజాలాన్ని వ్యతిరేకించాలి
- గాంధీ సిద్ధాంతాల స్ఫూర్తితోనే ప్రజా పాలన
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, అక్టోబర్ 2 (ఉద్యమ కెరటం):** అహింస, సత్యాగ్రహం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి మహాత్మా గాంధీ ఆలోచనలే ప్రపంచానికి మార్గదర్శకాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గాంధీజీ చూపిన మార్గంలోనే అసమానతలు, వివక్ష, అవమానాలు లేని సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఎల్బీ స్టేడియంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, టీపీసీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భట్టి విక్రమార్క ప్రసంగించారు. గాంధీజీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సే భావజాలాన్ని సమర్థించే ధోరణులు దేశంలో కనిపించడం బాధాకరమన్నారు. గాంధీని విమర్శిస్తూ గాడ్సే విధానాలే సరైనవని మాట్లాడే సంస్కృతిని దేశభక్తులెవరూ అంగీకరించరాదన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ నాయకత్వం, సత్యాగ్రహం, అహింసా సిద్ధాంతాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గాంధీతో కలిసి నడవని, ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమంతో సంబంధం లేని బీజేపీ నాయకులు నేడు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. దక్షిణాఫ్రికాలో ఎదురైన అవమానం గాంధీజీ జీవితంలో కీలక మలుపుగా మారిందని చెప్పారు. చంపారన్ సత్యాగ్రహం నుంచి దండి సత్యాగ్రహం వరకు సామాన్య ప్రజల సమస్యలను ఉద్యమాలకు కేంద్రంగా మార్చారన్నారు. గుప్పెడు ఉప్పుతో, చిన్న నూలు పోగుతో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి సవాల్ విసిరిన మహాత్ముడు ప్రజల శక్తిని ప్రపంచానికి చాటారని పేర్కొన్నారు.

## సమానావకాశాలు కల్పించడమే ప్రజా పాలన లక్ష్యం

గాంధీజీ ఆలోచనల స్ఫూర్తితోనే ప్రజల అవసరాలను గుర్తించి వారికి అనుగుణంగా విధానాలను ప్రజా ప్రభుత్వం రూపొందిస్తున్నదని తెలిపారు. ప్రజలందరికీ సమానావకాశాలు, విద్య, సామాజిక గౌరవం కల్పించడమే ప్రజా పాలన లక్ష్యమన్నారు. ఈ ఆలోచనలకు అనుగుణంగానే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. కులం, మతం, వర్గం అనే భేదాలు లేకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులు కలిసి చదువుకునేలా ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

## గాంధీ ఆలోచనలే సామాజిక సమానత్వానికి పునాది

స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే గాంధీజీ సామాజిక అసమానతలు, అంటరానితనానికి వ్యతిరేకంగా కూడా ఉద్యమించారని చెప్పారు. సమాజంలో వెనుకబడిన వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి ఆయన కృషి చేశారని తెలిపారు. హిందూ-ముస్లిం ఐక్యతను బలోపేతం చేసి స్వాతంత్ర్య ఉద్యమాన్ని విస్తృత ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దారని చెప్పారు. గాంధీ, నెహ్రూ తదితర జాతీయ నాయకులు వేసిన పునాదుల వల్లే స్వతంత్ర దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం వంటి రంగాల్లో పురోగతి సాధ్యమైందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తొలుత భట్టి విక్రమార్కకు గాంధీ వేషధారణలో ఉన్న చిన్నారులు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, గడ్డం వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గాంధీ భవన్‌లో..

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) ఆధ్వర్యంలో నాంపల్లిలోని గాంధీ భవన్‌లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్కడ ఉన్న గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, రవాణా, మైనారిటీ సంక్షేమ శాఖ, కార్మిక శాఖ మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, గడ్డం వివేకానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

- దశాబ్దాలుగా ప్రభుత్వాలు నిర్మించిన ప్రజల ఆస్తులివి
- కాంగ్రెస్ జాతీయ విధానం ఒకలా, తెలంగాణలో మరోలా ఏంటి?
- రాయపూర్ ఆర్థిక తీర్మానాలను రాష్ట్ర ప్రభుత్వం పాటిస్తుందా?
- రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ



**హైదరాబాద్, అక్టోబర్ 2 (ఉద్యమ కెరటం):** టీజీ-ట్రాన్స్‌కో, టీజీ-జెన్‌కో, సింగరేణి, డిస్కంలు, ఇతర వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలపై కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. ఈమేరకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత టీజీ-ట్రాన్స్‌కో 26 శాతం ఈక్విటీ డైల్యూషన్/ఐపీఓ (వాటా తగ్గింపు) నిర్ణయం మొత్తం ప్రభుత్వ విద్యుత్ సంస్థల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నదన్నారు. ఇది రాష్ట్రంలోని వ్యూహాత్మక విద్యుత్ మౌలిక వసతుల భవిష్యత్ యాజమాన్యం, నియంత్రణకు సంబంధించిన కీలక అంశమని, టీజీ-ట్రాన్స్‌కో ఒక సాధారణ వాణిజ్య సంస్థ కాదని, తెలంగాణ విద్యుత్ వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన కీలక ప్రజా సంస్థ అని గుర్తు చేశారు. టీజీ-ట్రాన్స్‌కో పరిధిలో 29,400 కేవీ సబ్‌స్టేషన్లు, 107, 220 కేవీ సబ్‌స్టేషన్లు, 337, 132 కేవీ సబ్‌స్టేషన్లు, 31,420కు పైగా సర్క్యూట్ కి.మీ ఈహెచ్ టీ లైన్లు, 1,184 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 43,848 ఎంవీఏ ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యం ఉన్నాయని తెలిపారు. దశాబ్దాలుగా ప్రజాధనంతో, గత ప్రభుత్వాల కృషితో నిర్మించిన ఈ ప్రభుత్వ ఆస్తులను రాత్రికి రాత్రి ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. 26 శాతం వాటా తగ్గింపు మొదటి అడుగు మాత్రమే.. భవిష్యత్తులో మిగిలిన వాటాను కూడా ప్రైవేటు చేతుల్లోకి అప్పగించే మార్గాన్ని సుగమం చేస్తున్నారు.. అంటే టీజీ-ట్రాన్స్‌కో తర్వాత టీజీ-జెన్‌కో, సింగరేణి, డిస్కంలు కూడా ఇదే బాట పట్టనున్నాయా అని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని ఢిల్లీలో కాంగ్రెస్ ఒక మాట.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మరో మాటా అని నిలదీశారు. కాంగ్రెస్ 2019 మేనిఫెస్టోలో వ్యూహాత్మకేతర, నాన్-కోర్ ప్రభుత్వ రంగ సంస్థలకే డిజ్‌ఇన్వెస్ట్‌మెంట్‌ను పరిమితం చేయాలని పేర్కొందన్నారు. 2023 రాయ్‌పూర్ కాంగ్రెస్ ప్లీనరీ ఆర్థిక తీర్మానంలో కూడా డిజ్‌ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో ప్రైవేట్ మోనోపోలీలు, డ్యూపోలీలు ఏర్పడకూడదని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మరి రాష్ట్రంలో వ్యూహాత్మక విద్యుత్ సంస్థ అయిన టీజీ-ట్రాన్స్‌కోలో ఈక్విటీ డైల్యూషన్ ఏ కాంగ్రెస్ విధానం ప్రకారం చేస్తున్నారు.. కాంగ్రెస్ సీడబ్ల్యూసీ తీర్మానాలు ఢిల్లీకి మాత్రమే పరిమితమా.. తెలంగాణలో వర్తించవా అని నిలదీశారు. మీరు కేంద్ర ప్రభుత్వ ప్రజా ఆస్తుల మానిటైజేషన్, ప్రైవేటీకరణ విధానాలను పదేపదే ప్రశ్నించారు.. ఎల్ఐసీ, విద్యుత్ రంగం వంటి వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా తగ్గింపుపైనా మీరు ఆందోళనలు వ్యక్తం చేశారు.. అదేవిధంగా ఉత్తరప్రదేశ్‌తో పాటు కాంగ్రెస్ అధికారంలో లేని ఇతర రాష్ట్రాల్లో విద్యుత్ రంగ ప్రైవేటీకరణను కాంగ్రెస్ వ్యతిరేకించింది.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఈ రాష్ట్రంలో అదే సూత్రం వర్తించాలి అని స్పష్టం చేశారు. టీజీ-ట్రాన్స్‌కో ప్రైవేటీకరణపై రాహుల్‌గాంధీ మౌనం వహిస్తే.. కాంగ్రెస్ జాతీయ విధానం, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ విధానం ఒక్కటి కానట్లేనా? తెలంగాణ ప్రభుత్వాన్ని సూటిగా అడుగుతున్నాం..టీజీ-ట్రాన్స్‌కోలో 26 శాతం వాటా ఎందుకు తగ్గిస్తున్నారు? టీజీ-జెన్‌కోకు సంబంధించి ఏం చేయబోతున్నారు?సింగరేణిపై ఎలాంటి ప్రతిపాదనలు ఉన్నాయి? డిస్కంల భవిష్యత్ యాజమాన్యంపై ప్రభుత్వం ఆలోచన ఏమిటి? ప్రజల ఆస్తులను ప్రజల అనుమతి లేకుండా ప్రైవేట్ ప్రయోజనాలకు అప్పగించే నిర్ణయాలు తీసుకోవద్దు. ప్రభుత్వ ఆస్తుల యాజమాన్యం లేదా నియంత్రణను ప్రభావితం చేసే నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలి. టీజీ-ట్రాన్స్‌కో ఐపీఓ, 26 శాతం ఈక్విటీ డైల్యూషన్‌ను తక్షణమే నిలిపివేయాలి.టీజీ-జెన్‌కో, సింగరేణి, డిస్కంలు, ఇతర వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థలపై ఐపీఓ, ఈక్విటీ డైల్యూషన్, ప్రైవేటీకరణ ఆలోచనలను ఉపసంహరించుకోవాలి. ఈ ప్రతిపాదనలు కాంగ్రెస్ 2019 మేనిఫెస్టో, 2023 రాయ్‌పూర్ ఆర్థిక తీర్మానాలకు ఎలా అనుగుణంగా ఉన్నాయో తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ విధానం మారితే బహిరంగంగా ప్రకటించాలి.. విధానం మారకపోతే తెలంగాణ ప్రభుత్వాన్ని నిలువరించాలి.. ఒక జాతీయ పార్టీ విశ్వసనీయత తీర్మానాలు చేయడంలో కాదు.. వాటిని అమలు చేయడంలో ఉంటుంది అని పేర్కొన్నారు. అందుకే రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ వెంటనే జోక్యం చేసుకుని టీజీ-ట్రాన్స్‌కో ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు. టీజీ-ట్రాన్స్‌కోతో మొదలయ్యే ప్రైవేటీకరణకు ఇక్కడే అడ్డుకట్ట వేయాలి.. టీజీ-జెన్‌కో, సింగరేణి, డిస్కంలను కూడా ప్రైవేటీకరణ బారి నుంచి కాపాడాలి అని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ద్వంద్వ విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారన్న విషయం గుర్తించి వ్యవహరించండి అని హరీష్‌రావు హితవు పలికారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య క్విడ్‌ప్రోకో

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



**హైదరాబాద్, అక్టోబర్ 2 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, గతంలో పాలించిన బీఆర్ఎస్ పార్టీల మధ్య పరస్పర అవినీతి బాగోతాలను కప్పిపుచ్చుకునే క్విడ్‌ప్రోకో నడుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సిరిసిల్ల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి ప్రతిగా బీఆర్ఎస్ నేతల ఆరోపణలు కేవలం పరస్పర విమర్శలకే పరిమితమయ్యాయని, దీనివల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని దుయ్యబట్టారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి రహిత పరిపాలన అందిస్తుంటే, రాష్ట్రంలో మాత్రం ఎవరు ఎక్కువ అవినీతి చేయాలనే పోటీ పడుతున్నారని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకుంటామని చెప్పిన కాంగ్రెస్, నేటికీ ఒక్క కేసులోనూ అరెస్టు చేయకుండా లోపాయికారీ ఒప్పందాలతో కాలం గడుపుతోందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రశ్నించే వారిపై అక్రమ అరెస్టులతో ఉక్కుపాదం మోపుతోందని రామచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివాదాస్పద జీవో 317కి ప్రత్యామ్నాయంగా తెచ్చిన జీవో 190 పరిధిలో దాదాపు 4,000 మందికి బదిలీలు, డెప్యుటేషన్లు రావాల్సి ఉండగా కేవలం 100 నుంచి 200 మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. దీనిపై గాంధీ భవన్ ఎదుట న్యాయబద్ధంగా ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులను అరెస్టు చేయించడాన్ని బీజేపీ పక్షాన తీవ్రంగా ఖండిస్తూ, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాష్ట్రంలో నీళ్లు, విద్యుత్ లేక పంటలు ఎండిపోయి రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌లో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలను ఆదుకునేందుకు రాబోయే రబీ ప్రారంభానికి ముందే 'రైతు భరోసా' నిధులను వారి ఖాతాల్లో జమ చేయాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం చెల్లించకపోవడం వల్లే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని స్పష్టం చేశారు. ఈ సమావేశం సందర్భంగా సినిమా, టీవీ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు బీజేపీలో చేరారు. బీజేపీ స్టేట్ సినిమా సెల్ కో-కన్వీనర్, నటుడు వైభవ్ సూర్య ఆధ్వర్యంలో టీవీ ఆర్టిస్ట్, న్యాయవాది స్వర్ణలత, ప్రముఖ టీవీ నటుడు లక్ష్మణ్, సీనియర్ కెమెరామెన్లు సురేష్, మహేష్‌లకు రామచందర్ రావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల తీరుతో విసిగిపోయిన ప్రజలు రాబోయే రోజుల్లో బీజేపీకే అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీనర్సయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్, అధికార ప్రతినిధి ఇంద్రసేనా రెడ్డి, రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



# 4న రాష్ట్రానికి అమిత్ షా రాక

## తూప్రాన్‌లో అమూల్ డెయిరీ ప్లాంట్ ప్రారంభోత్సవం

## సబర్ డెయిరీ ప్రాజెక్టుకు భూమి పూజ

## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 2 (ఉద్యమ కెరటం):** కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ఈ నెల 4వ తేదీన రాష్ట్రంలో పర్యటించనున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఊర్జీ ఇండస్ట్రియల్ పార్కులో ఆరోజు ఉదయం 10 గంటలకు నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. సబర్ డెయిరీ ప్రాజెక్టు భూమి పూజతోపాటు అమూల్ సంస్థ రాష్ట్రంలో అత్యంత ఆధునికంగా ఏర్పాటు చేసిన మొట్టమొదటి డెయిరీ ప్లాంట్‌ను ఆయన చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో పాడిపరిశ్రమ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతోపాటు, వాల్యూ క్రియేషన్ పెంచి పాడి రైతులకు ఆర్థికంగా చేయూతనందించడమే ఈ ప్లాంట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పాలు 5 లక్షల లీటర్లు (5 ఎలఎల్‌పీడీ), పెరుగు 200 మెట్రిక్ టన్నులు (200 ఎంటీపీడీ), మజ్జిగ అండ్ లస్సీ చెరో 30 కిలో లీటర్లు (30 కేఎల్‌పీడీ), పనీరు 10 మెట్రిక్ టన్నులు (10 ఎంటీపీడీ), ఐస్ క్రీమ్: 50 కిలో లీటర్లు (దీన్ని భవిష్యత్తులో లక్ష లీటర్ల వరకు విస్తరించే అవకాశం ఉంది), స్వీట్స్ అండ్ బేకరీ ఉత్పత్తులు రోజుకు 3 నుంచి 5 మెట్రిక్ టన్నులు, నెయ్యి 5 మెట్రిక్ టన్నులు ఈ ప్లాంటులో ఉత్పత్తి జరుగుతాయన్నారు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన శ్వేత విప్లవం 2.0 ద్వారా 2028-29 నాటికి డెయిరీ కో ఆపరేటివ్స్ ద్వారా పాల సేకరణను 50% పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. 2029 నాటికి దేశవ్యాప్తంగా 75,000 కొత్త పాడి సహకార సంఘాలను (ఎన్‌డీసీఎస్) ఏర్పాటు చేయనుండగా ఇందులో భాగస్వామ్యంగా తెలంగాణలో 1,525 కొత్త సహకార సంఘాలను నిర్దేశించినట్లు స్పష్టం చేశారు. గత 12 ఏళ్లలో నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌సీడీసీ) ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి రూ.1.16 లక్షల కోట్ల సహాయం అందించినట్లు తెలిపారు. ధాన్యం(వరి) సేకరణకు 2025-26 సీజన్‌కు రూ.37,000 కోట్లు, 2026-27 రబీ సీజన్ కోసం రూ.22,700 కోట్ల రుణాన్ని మంజూరు చేసినట్లు చెప్పారు. సహకార చట్టాల విస్తరణ పార్లమెంటులో ఇటీవలే ఎన్‌సీడీసీ బిల్లు ఆమోదం పొందడంతో రిజిస్టర్డ్ కోఆపరేటివ్స్‌తోపాటు సహకార రంగంలో పనిచేసే అన్ని సంస్థలకూ నిధుల లభ్యత ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న 60వేల పైచిలుకు సహకార సంఘాల్లో 70% గ్రామీణ ప్రాంతాల్లోనే ఉండగా వాటిలో కోటిమందికి పైగా సభ్యులు ఉన్నారని, కేంద్ర ప్రభుత్వ చర్యలు రాష్ట్రంలోని రైతులకు, పాడి రైతులకు ఎంతో లబ్ది చేకూరుస్తాయని కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేను పోటీలో ఉన్నా..

## తప్పుడు ప్రచారాలను నమ్మకండి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి స్పష్టీకరణ
- పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు బరిలో నిలుస్తున్నా..
- సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు అవాస్తవం
- పట్టభద్రుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమన్న సర్వోత్తమ్ రెడ్డి



**సూర్యాపేట, అక్టోబర్ 2 (ఉద్యమ కెరటం):** నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థిగా తాను ఎన్నికల బరిలో దృఢంగా నిలుస్తున్నానని రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన ఆయన విడుదల చేశారు. తన పేరును పార్టీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించిందని, పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ కాంగ్రెస్ అభ్యర్థిగా తాను ఎన్నికల బరిలో నిలుస్తున్నానని రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. అధిష్టానం తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌తో కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు. అయితే తన అభ్యర్థిత్వంపై కొందరు కావాలనే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను టికెట్ అడగలేదని , ఎమ్మెల్సీగా పోటీ చేయడానికి సిద్ధంగా లేనని చేతులెత్తేశారని, యూ టర్న్ తీసుకున్నారని అంటూ ప్రచారం చేయడం దుర్మార్గమని అన్నారు. తాను ఎన్నికల నుంచి తప్పుకుంటానని ఎక్కడ కూడా చెప్పలేదని పేర్కొన్నారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో స్వీకరిస్తున్నానని తెలిపారు. యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం తన లక్ష్యమని తెలిపారు. తన దీర్ఘకాలిక రాజకీయ లక్ష్యాల గురించి గతంలో చెప్పిన విషయాలను ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలతో ముడిపెట్టి వక్రీకరించడం సరికాదని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి, పట్టభద్రుల సమస్యలకు బలమైన ప్రాతినిధ్యం వహించడమేనని తన ప్రస్తుత లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నానని, ఎన్నికల బరిలో ఉన్నానని, పట్టభద్రుల ఆశీస్సులతో ముందుకు సాగుతానని ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయం లో వెనకడుగు వేసే ప్రసక్తి లేదని తెలిపారు. ఇక "రెండు సీట్లు రెడ్లకే ఇవ్వడంతో బీసీ వర్గాల్లో ఆగ్రహం వచ్చిందని, అందుకే కాంగ్రెస్ అభ్యర్థిని మార్చబోతోందని" చేస్తున్న ప్రచారానికి కూడా ఎలాంటి ఆధారం లేదని తెలిపారు. సామాజిక వర్గాల మధ్య విభేదాలు సృష్టించేలా తప్పుడు ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని, అసత్య ప్రచారాలు చేసే వారి పై చర్య తీసుకుంటానని సర్వోత్తం రెడ్డి హెచ్చరించారు. తన అభ్యర్థిత్వంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## సంపాదకీయం



# కాలుష్యానికి కారణమెవరు!?

## చలికాలం వచ్చిందంటే ఢిల్లీని కమ్మేస్తున్న విషపు గాలి

### వాహనాలు.. రోడ్డు దుమ్ము.. నిర్మాణాలు.. పరిశ్రమలు.. పంట వ్యర్థాల దహనం.. కారణాలు అనేకం

ఢిల్లీ పేరు వినగానే ఎర్రకోట, పార్లమెంటు, ఇండియా గేట్‌తోపాటు ఇప్పుడు మరో పదం కూడా గుర్తుకొస్తోంది.. కాలుష్యం! ఏటా చలికాలం సమీపించగానే దేశ రాజధానిని పొగమంచులా కమ్మేసే విషపు గాలి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మరి ఢిల్లీ కాలుష్యానికి అసలు కారణమెవరు?.. వాహనాలా?.. నిర్మాణాలా?.. పరిశ్రమలా?.. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనమా?.. లేక ఏటా సమస్య తీవ్రరూపం దాల్చిన తర్వాతే మేల్కొనే ప్రభుత్వ వ్యవస్థలా?.. నిజానికి ఒక్క కారణాన్ని వేలెత్తి చూపేంత సరళమైన సమస్య ఇది కాదు. వాహన ఉద్గారాలు, రోడ్డు దుమ్ము, నిర్మాణ కార్యకలాపాలు, వ్యర్థాల దహనం, పరిశ్రమలు, ప్రాంతీయ కాలుష్యంతోపాటు చలికాలంలో గాలి వేగం తగ్గడం వంటి వాతావరణ పరిస్థితులన్నీ కలసి ఢిల్లీ గాలిని ప్రమాదకరంగా మారుస్తున్నాయి.

### చలికాలం రాగానే.. ఆంక్షల చిట్టా!

ఢిల్లీ ప్రభుత్వం 2026-27 శీతాకాల కాలుష్య నియంత్రణ ప్రణాళికను ఇప్పటికే ప్రకటించింది. చెల్లుబాటయ్యే కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం లేని వాహనాలకు ఇంధనం ఇవ్వకుండా తనిఖీలు కఠినతరం చేయడం, పార్కింగ్ రుసుములను పెంచడం, కార్యాలయ వేళలను మార్చడం, కొన్ని దశల్లో సగం మంది ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేసేలా చర్యలు చేపట్టడం ఇందులో ఉన్నాయి. ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ గుర్తింపు వ్యవస్థ ఉన్న 500 ఇంధన కేంద్రాల్లో అక్టోబర్ 1 నుంచే తనిఖీలను ముమ్మరం చేయాలని నిర్ణయించారు. ధూళిని వెదజల్లే కూల్చివేతలు, బహిరంగ నిర్మాణ కార్యకలాపాలపై నవంబర్ 1 నుంచి జనవరి 31 వరకు ఆంక్షలు విధించనున్నారు. డిసెంబర్ 10 నుంచి జనవరి 20 వరకు నిర్మాణ, కూల్చివేత కార్యకలాపాలపై మరింత కఠినమైన నిషేధం అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాలుష్యం అత్యంత తీవ్రస్థాయికి చేరిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే ముందుగానే నివారణ చర్యలు అమలు చేయడమే ఈసారి ప్రణాళిక లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది.

### పంట వ్యర్థాలే మొత్తం కారణమా?

ఢిల్లీ కాలుష్యం చర్చకు వచ్చిన ప్రతిసారీ పంజాబ్, హర్యానా తదితర ప్రాంతాల్లో పంట వ్యర్థాల దహనం ప్రధానంగా తెరపైకి వస్తుంది. అయితే ఢిల్లీ కాలుష్యమంతటికీ రైతులే కారణమని చెప్పడం వాస్తవ పరిస్థితిని అతిసరళీకరించడమే అవుతుంది. పంట వ్యర్థాల దహనం కొన్ని రోజుల్లో కాలుష్య తీవ్రతను గణనీయంగా పెంచగలిగినా.. ఢిల్లీలోనే ఉత్పత్తయ్యే వాహన, దుమ్ము, నిర్మాణ, వ్యర్థాల దహనం వంటి కాలుష్య మూ లాలు ఏడాది పొడవునా ప్రభావం చూపుతాయి. కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాల తాజా సమీక్ష కూడా సమస్యను ఢిల్లీ-ఎన్‌సీఆర్ మొత్తానికి సంబంధించిన ప్రాంతీయ సమస్యగానే చూ స్తోంది. బాణాసంచా అంశం కూడా దీపావళి సమయంలో మరోసారి చర్చకు వస్తోంది. సుప్రీంకోర్టు తాజా విచారణలో పూర్తిస్థాయి నిషేధానికీ, రోజంతా నిర్బంధం లేకుండా బాణాసంచా కాల్చడానికీ అనుకూలంగా లేదని పేర్కొంది. అనుమతించాల్సిన బాణాసంచా రకాలు, సమయాల విషయంలో సమతుల్య విధానం అవసరమని అభిప్రాయపడింది. తుది పరిమితులపై తదుపరి విచారణల్లో మరింత స్పష్టత రావాల్సి ఉంది.

### తాత్కాలిక మందులతో ఎంతకాలం?

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఏటా అక్టోబర్, నవంబర్ రాగానే నిర్మాణాలు ఆపడం, వాహనాలపై ఆంక్షలు విధించడం, పార్కింగ్ రుసుములు పెంచడం, ఇంటి నుంచి పని చేయించడం వంటి అత్యవసర చర్యలు తీసుకుంటున్నారు. ఇవి తీవ్రమైన కాలుష్య సమయంలో అవసరమైన చర్యలే. కానీ ఢిల్లీ గాలి శాశ్వతంగా మెరుగుపడాలంటే ప్రజా రవాణా విస్తరణ, రోడ్డు దుమ్ము నియంత్రణ, నిర్మాణ నిబంధనల నిరంతర అమలు, చెత్త దహనం నివారణ, పరిశ్రమల ఉద్గారాల పర్యవేక్షణ, స్వచ్ఛ ఇంధన వినియోగంతోపాటు పొరుగు రాష్ట్రాలతో ఏడాది పొడవునా సమన్వయం అవసరం. అందుకే 'ఢిల్లీ కాలుష్యానికి కారణమెవరు?' అన్న ప్రశ్నకు ఒక వ్యక్తి, ఒక ప్రభుత్వం, ఒక రాష్ట్రం లేదా రైతులను మాత్రమే చూపించడం సమాధానం కాదు. అనేక కాలుష్య మూలాలు, భౌగోళిక-వాతావరణ పరిస్థితులు కలిసి సమస్యను తీవ్రం చేస్తున్నాయి. వాటన్నింటినీ ఒకేసారి లక్ష్యంగా చేసుకున్న దీర్ఘకాలిక కార్యాచరణ ఎంత సమర్థంగా అమలవుతుందన్నదే ఢిల్లీకి స్వచ్ఛమైన గాలి ఎప్పుడు దక్కుతుందో నిర్ణయించనుంది.



# గాంధీ స్మృతిలో ప్రధాని మోదీ

### గాంధీజీ, లాల్ బహదూర్‌లకు ఘన నివాళులు!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 2 (ఉద్యమ కెరటం):** గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని 'గాంధీ స్మృతి' వద్ద నిర్వహించిన ప్రత్యేక సర్వధర్మ ప్రార్థనా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గాంధీజీ బోధించిన సత్యం, శాంతి, అహింసా సిద్ధాంతాలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని ప్రధాని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు, భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కూడా గాంధీ స్మృతిని దర్శించి, దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్ముడు పోషించిన చారిత్రాత్మక పాత్రను, ఆయన అందించిన సామాజిక సామరస్య సందేశాన్ని గుర్తుచేసుకుంటూ నివాళులర్పించారు. అంతకుముందు రాజ్‌ఘాట్‌లోని గాంధీజీ సమాధిని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించి, అక్కడ జరిగిన సర్వధర్మ ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని విజయ్‌ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. 1964 నుంచి 1966 వరకు భారత ప్రధానిగా సేవలందించిన శాస్త్రి, 1965 ఇండో-పాక్ యుద్ధ సమయంలో దేశానికి అందించిన సమర్థవంతమైన నాయకత్వాన్ని, ఆయన ఇచ్చిన 'జై జవాన్, జై కిసాన్' నినాదాన్ని, పాటించిన ఉన్నత విలువలను ప్రధాని కొనియాడారు. 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించిన మహాత్మా గాంధీ ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల ద్వారా భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించిన తీరు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. గాంధీజీ జయంతిని ఐక్యరాజ్యసమితి 'అంతర్జాతీయ అహింసా దినోత్సవం'గా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, గాంధీజీ మరియు లాల్ బహదూర్ శాస్త్రుల దివ్య స్మృతికి దేశవ్యాప్తంగా నాయకులు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు.



# జంతర్ మంతర్ వద్ద పోలీస్ బస్సును అడ్డుకున్న మహిళ

### నిరసనకారులను తీసుకెళుతుండగా చోటుచేసుకున్న ఘటన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 2:** న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక మహిళ పోలీస్ బస్సును అడ్డుకునేందుకు ప్రయత్నించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ దృశ్యాలను చూసిన నెటిజన్లు, కొన్ని నెలల క్రితం ముంబైలో మోడల్ రియా అహిర్ చేసిన చర్యతో దీనిని పోలుస్తూ రకరకాలుగా స్పందిస్తున్నారు. నిరసనకారులను అదుపులోకి తీసుకుని బస్సులో తరలిస్తున్న క్రమంలో, సదరు మహిళ ఆ వాహనానికి అడ్డుగా నిలబడింది. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ మహిళా పోలీసులు ఎవరూ లేరని 'ఎక్స్' వేదికగా వెలువడిన ఒక పోస్ట్ ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొడుతోంది. గత జులై 2026లో ముంబైలో జరిగిన నిరసనల సందర్భంగా, విద్యార్థులను తరలిస్తున్న పోలీస్ వ్యాన్‌ను రియా అహిర్ (రియా ఇకౌసియా) అడ్డుకున్నారు. వర్షంలో తడుస్తూనే సుమారు 40 నిమిషాల పాటు వాహనాన్ని ముందుకు కదలనివ్వకుండా ఆమె నిలువరించడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనతో ఆమె సోషల్ మీడియాలో విశేష గుర్తింపు పొందారు. తాజాగా జంతర్ మంతర్ వద్ద చోటు చేసుకున్న ఘటన కూడా అదే తరహాలో ఉండటంతో, కేవలం ప్రచారం కోసమే ఈ మహిళ రియా అహిర్‌ను అనుకరించి ఉండవచ్చని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ మహిళ ఎవరు, ఆమె ఉద్దేశం ఏంటి అనే విషయాలపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే వివరాలు ఇంకా తెలియరాలేదు.





# ఇద్దరు పాక్ చొరబాటుదారుల కాల్చివేత

### కాల్చి చంపిన బీఎస్ఎఫ్ బలగాలు

### చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన బీఎస్ఎఫ్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 2:** పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఈరోజు కాల్చి చంపింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు వారు చేసిన ప్రయత్నాన్ని బీఎస్ఎఫ్ దళాలు సమర్థవంతంగా భగ్నం చేశాయి. ఈ ఘటనలో మరో చొరబాటుదారుడు పాకిస్థాన్ వైపు తిరిగి పారిపోయినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, టార్న్ టారన్ జిల్లాలోని ఖల్రా సెక్టార్ పరిధిలో ఉన్న రాజోకే బోర్డర్ అవుట్‌పోస్ట్ (బీఓపీ) సమీపంలో ఈ ఘటన జరిగింది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా భారత భూభాగం వైపు వస్తుండటాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన దళాలు, ముందుకు రావొద్దని వారిని హెచ్చరించాయి. అయితే, పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోకుండా ముందుకు సాగడంతో బీఎస్ఎఫ్ కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారిని ఇంకా అధికారికంగా గుర్తించలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంజాబ్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో సోదాలు కొనసాగుతున్నాయి.

# ముంబైలో పోటాపోటీ నిరసనలు

- సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్' ఆందోళన
- సీఈసీ రాజీనామా డిమాండ్ చేస్తూ సీజేపీ ఆందోళన
- పోటాపోటీ ప్రదర్శనలతో ముంబైలో ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు, భద్రతా బలగాలు



**ముంబై, అక్టోబర్ 2:** ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఓవైపు నిరసనలు చేపట్టగా, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ముంబై' బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ జయంతి సందర్భంగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, ముంబైలోని శివాజీ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. తమ నిరసనకు ప్రజలు మద్దతు ప్రకటించాలని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ విజ్ఞప్తి చేశారు. వీరికి ప్రతిగా జెన్ నెక్ట్స్ ముంబై సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఒక నిరసనకారుడు మాట్లాడుతూ, "అభిజీత్ దీప్కే వంటి వ్యక్తులు రాజ్యాంగాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు. కానీ రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలుసు. అందుకే మేం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం. కాక్రోచ్ జనతా పార్టీ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం" అని స్పష్టం చేశారు. ఈ పోటాపోటీ ప్రదర్శనల ప్రభావంతో సోషల్ మీడియాలోనూ ఇరు వర్గాల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు జెన్ నెక్ట్స్ మద్దతుదారులు సీజేపీ సభ్యులను 'దిమాగీ నక్సల్స్'గా అభివర్ణించగా, జెన్ నెక్ట్స్ నిరసనల వెనుక బీజేపీ హస్తం ఉందని సీజేపీ వర్గాలు ఆరోపించాయి. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు, భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ చేస్తున్న ప్రచారం ఏ స్థాయిలో విభేదాలకు దారితీసిందో ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి.



# గాంధీ చూపిన అహింసా మార్గం దేశానికి దిక్సూచి



**ఉద్యమ కెరటం, బోథ్:** గాంధీజీ చూపిన అహింసా మార్గం దేశానికి దిక్సూచి అని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బోథ్ మండల కేంద్రంలో శుక్రవారం బోథ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మెరుగు భోజన్న, కాంగ్రెస్ సీనియర్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో బాపూజీ చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్, ఉప సర్పంచ్ పూర్ణ విజయ రెడ్డి, ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, పీఏసీ మెంబెర్స్ చాట్ల ఉమేష్, గడ్డం సురేందర్, మహ్మద్, రాజు రెడ్డి, బోథ్ మండల అధికార ప్రతినిధి అచ్యుత్ రెడ్డి, జనరల్ సెక్రటరీ అబూద్, సున్నపు శ్రీనివాస్, మాజీ బ్లాక్ చైర్మన్ మేరుగు నర్సింహదాస్, మాజీ ఎంపీటీసీ షేక్, నాయకులు బొజ్జ సాయన్న, బుక రాములు, ఎండి.సద్దాం, సన్నీ రెడ్డి, జల్పత్, రహీమొద్దీన్, అలీం, దోర శేఖర్, అమీరొద్దీన్, మేరుగు రమణ, మారుతీ ధన్నూర్ గ్రామ అధ్యక్షులు అభిరెడ్డి, పట్నాపూర్ గ్రామ అధ్యక్షులు గుణవంత్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులు పంపిణీ



**ఉద్యమ కెరటం,జైనూర్:** జైనూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ కొడప ప్రకాష్ అధ్యక్షతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ ఆడ బీర్షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ కొడప ప్రకాష్తో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదరి ఆనంద్ రావ్, అమృత్, వార్డ్ సభ్యులు షేక్ రహీం, షేక్ నష్మ, బుతాలే కిరణ్, షేక్ ఇసాక్, మాలన్ బి మజార్ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేనలో భారీ చేరికలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని మంగల్మోటా గ్రామంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో భారీ చేరికలు జరిగాయి. బోథ్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు రాథోడ్ బాపురావు సమక్షంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, యువకులు శుక్రవారం పార్టీలో చేరారు. వారికి బాపురావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగల్మోటా గ్రామానికి త్వరలో గ్రావెల్ రోడ్డు వేయిస్తానని, గ్రామంలోని హనుమాన్ ఆలయం ముందు షెడ్డు నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి స్థానిక నాయకుల సమన్వయం అవసరమని, మౌళిక వసతులు, తాగునీరు, రహదారుల వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ బాపురావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహాత్మునికి నివాళులు అర్పించిన బోరంచు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** సత్యం, శాంతి, అహింసా మార్గంలో పోరాడి దేశ ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని శుక్రవారం పట్టణంలోని గాంధీ పార్కో ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి అధికారులు, నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ లతో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన సేవలు, అహింసా మార్గాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ సివిన్ రాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం గాంధీ చౌక్ లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గాంధీ జయంతి సందర్భంగా జాతిపిత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# 'హర్ ఘర్ జల్'తో ప్రతీ ఇంటికీ మంచినీరు

- జిల్లా కలెక్టర్ కె. హరిత
- గోవింద్పూర్ గ్రామంలో 100% మంచినీటి కనెక్షన్ల సాధన అభినందనీయం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'హర్ ఘర్ జల్ – జల్ జీవన్ మిషన్' ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని గోవింద్ పూర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ మంచినీటి సరఫరా కల్పించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపడుతోందన్నారు. గోవింద్ పూర్ గ్రామంలో వంద శాతం మంచినీటి కనెక్షన్లు సాధించడం గ్రామస్థుల సహకారం సంబంధిత శాఖల అధికారుల సమన్వయానికి నిదర్శనమని, ఇది ఎంతో అభినందనీయమని కొనియాడారు. ప్రతి ఇంటికీ అందుబాటులోకి వచ్చిన మంచినీటిని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఒక్క బొట్టు నీటిని కూడా వృథా చేయకుండా పొదుపుగా వాడాలని సూచించారు. నీటి పైపులైన్లు, నల్లాలు తదితర వాటిలో చిన్నచిన్న లీకేజీలు లేదా మరమ్మతులు ఏర్పడినప్పుడు వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి వృథాను అరికట్టాలని కలెక్టర్ కోరారు. గాంధీ జయంతి సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, సామాజిక బాధ్యత విషయంలో మహాత్మా గాంధీ చూపిన బాటను ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత, నీటి సంరక్షణపై చిన్నారులు కూడా తమ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామంలో ఏవైనా తాగునీటి సరఫరా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తేవాలని, ప్రజల సమస్యలు తీర్చేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి, అధికారులు , గ్రామస్థులు పాల్గొన్నారు.

# మహాత్ముని ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

జిల్లా కలెక్టర్ కె. హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** మహాత్మా గాంధీ చూపిన శాంతి, అహింస, సత్య మార్గాలలో పయనిస్తూ ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. యావత్ దేశాన్ని స్వాతంత్ర్య సంగ్రామంలో సంఘటితం చేసి శాంతి, అహింసా మార్గంలో నడిపించిన ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలోని రుగ్మతల నిర్మూలనకు, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, గ్రంథాలయ చైర్మన్ అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, కలెక్టరేట్ ఏవో కిరణ్, జెడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నదీముద్దీన్, పలువురు జిల్లా అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

# పేదవారికి సాయం చేయడంలో ఎంతో తృప్తి ఉంటుంది

సింగరేణి డిప్యూటీ మేనేజర్ సాయి తేజ



**ఉద్యమ కెరటం, రెబ్బెన:** సమాజంలో పేదవారి ఆకలి తీర్చడంలో, వారికి సాయం చేయడంలో ఎంతో తృప్తి ఉంటుందని సింగరేణి డిప్యూటీ మేనేజర్ దీకొండ సాయి తేజ అన్నారు. మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా ఎస్ వి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో శుక్రవారం వృద్ధులకు పాలు, పండ్లు ,బ్రెడ్డు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదవారికి స్వచ్ఛందంగా స్వచ్ఛందంగా సేవ చేయడంలో మానసిక ఆనందం ఎంతో ఉంటుందని పేదవారికి సహాయం చేయడంలో సంజీవని స్వచ్ఛంద సంస్థ గతంలో కూడా ఎన్నో సేవలు చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు దీకొండ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం , పండ్ల పంపిణీ, పేదవారికి దుప్పట్ల పంపిణీ, పేద విద్యార్థులకు పాఠశాలలో ఫీజులలో రాయితీ ఇప్పించడం జరిగిందని అన్నారు. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా మనసున్న మహారాజులు ఎవరైనా ఉంటే సహాయం చేస్తూ పేదవారికి ఆకలి తీర్చడానికి ముందుకు రావాలని స్వచ్ఛంద సంస్థ ఎప్పుడు మీ పేరు మీద మీకు సహకారిగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ కుమారి , హిమబిందు, కమల తో పాటు వృద్ధులు ఉన్నారు.

# జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలి

- టీయుడబ్ల్యూజే-143 జిల్లా కన్వీనర్ రవి నాయక్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్–143 ఆధ్వర్యంలో జర్నలిస్టులకు క్యాష్లెస్ హెల్త్ కార్డులను వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్లోని మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి, డిమాండ్లతో కూడిన పత్రాన్ని అందజేసి సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ రవి నాయక్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టులకు క్యాష్లెస్ హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు సులభంగా అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు తెలంగాణ జర్నలిస్టులు పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు రాజు ,ప్రధాన కార్యదర్శి సదాశివ్, జర్నలిస్టు లు సతీష్, సురేష్, రామస్వామి, చందు, ఇర్ఫాన్, సంతోష్, వెంకటేష్, రాందాస్, అవినాష్, శ్రీకాంత్, రవి, అశోక్, రవీందర్, రాజేష్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# టీడబ్ల్యూయూ గెలుపునకు కార్మికులు ఏకం కావాలి

జిల్లా మాజీ అధ్యక్షుడు బి.డి. చారి పిలుపు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో ఈనె 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ) బాణం గుర్తుకు కార్మికులు మద్దతు ఇచ్చి గెలిపించాలని ఆ యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు బి.డి.చారి పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ డిపో పరిధిలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, హక్కుల సాధన కోసం టీడబ్ల్యూయూ నిరంతరం పోరాడుతోందన్నారు. అశ్వద్ధామరెడ్డి జనరల్ సెక్రటరీగా, జక్కుల మల్లేష్, రాజారెడ్డి తదితరుల నాయకత్వంలో యూనియన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్కు మద్దతుగా కార్మికులు టీడబ్ల్యూయూకు అండగా నిలవాలని కోరారు. ఈ ఎన్నికల్లో టీడబ్ల్యూయూ, ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) మధ్య ప్రధాన పోటీ ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 37వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. సంస్థను మూడు జోన్లు, పది రీజన్లుగా విభజించారని, ప్రతి ఉద్యోగి రెండు ఓట్లు వేయాల్సి ఉంటుందని వివరించారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఆరు డిపోల్లో 1,773 మంది ఓటర్లు ఉండగా, ఆదిలాబాద్ డిపో పరిధిలో 427 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 9న ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఉద్యోగులు చైతన్యంతో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. టీడబ్ల్యూయూ గెలిస్తే 2017, 2021 సంవత్సరాలకు సంబంధించిన ఏరియర్స్, 2025 ఏప్రిల్ 1 నుంచి రావాల్సిన పీఆర్సీతో పాటు ఉద్యోగ భద్రత కల్పించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) మద్దతు టీడబ్ల్యూయూకు ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగేల నర్సింగ్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు శ్రీకర్ గౌడ్, కార్మిక నాయకులు ఎస్.భీమ్రావు, ఎం.అనిల్, షేక్ నజీర్, హెచ్.సంతోష్, ఎండీ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# జైలు శిక్షా కాలం పరివర్తనకు వేదిక కావాలి

- జిల్లా కలెక్టర్ కె. హరిత
- జైలును సందర్శించిన కలెక్టర్, అధికారులు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** గతంలో జరిగిన తప్పుల గురించి ఆలోచిస్తూ కాలం వృథా చేయకుండా, భవిష్యత్తుపై దృష్టి పెట్టి సన్మార్గంలో పయనించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఖైదీలకు పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి (సెక్రెటరీ) అనూష, అదనపు ఎస్పీ చిత్తరంజన్, జైలర్ ప్రవీణ్‌లతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జైలులో గడిపే సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సత్ప్రవర్తనతో మెలగాలని, తద్వారా విడుదలయ్యాక సమాజంలోనూ, కుటుంబంలోనూ మళ్లీ గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభించవచ్చని ఆకాంక్షించారు. జైలులో అందిస్తున్న వివిధ రకాల వృత్తి విద్యా, ఉపాధి శిక్షణ కార్యక్రమాలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని, ఇవి విడుదల తర్వాత స్వయం ఉపాధికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే విద్యపై ఆసక్తి ఉన్న ఖైదీల కోసం ఓపెన్ స్కూలింగ్, దూరవిద్య ఓపెన్ యూనివర్సిటీ కోర్సుల ద్వారా ఉన్నత చదువులు పూర్తి చేసే అవకాశాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. నేటి జైళ్లలో పూర్వకాలం కంటే భిన్నంగా ఖైదీలకు అవసరమైన ప్రాథమిక వసతులతో పాటు మంచి గాలి, నీరు, వెలుతురు, పౌష్టిక ఆహారం, ఆరోగ్య సంరక్షణ వంటి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. జైలు వాతావరణాన్ని సానుకూలంగా మార్చుకుని ప్రశాంతమైన జీవితం వైపు అడుగులు వేయాలని కోరుతూ ఖైదీలకు గాంధీ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు, జైలు సిబ్బంది ఖైదీలు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి

- జిల్లా అటవీ శాఖ అధికారిని బాలమణి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారిని బాలమణి తెలిపారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం నుండి గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాల విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీకి ఆసిఫాబాద్ ఎఫ్ ఆర్ ఓ గోవింద్ చంద్ సర్దార్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో 1955 నుండి నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా వారం రోజులపాటు అంటే ఈ నెల 8వ తారీకు వరకు జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు యోగేష్, ఝాన్సీ రాణి, సెక్షన్ అధికారులు మహేందర్, సాయి, మల్లయ్య, సతీష్, గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాల పిడి మీనా రెడ్డి, బీట్ అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.



# కుల వివక్షపై పోరాటాలు ఉధృతం చేస్తాం

- కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** దళితులు, గిరిజనులు, పేదల హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ తెలిపారు. కెవిపిఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆసిఫాబాద్‌లోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దినకర్ మాట్లాడుతూ కెవిపిఎస్ నిర్వహించిన పోరాటాల ఫలితంగానే గతంలో గ్రామీణ ప్రాంతాల్లోని 62 రకాల కుల వివక్ష రూపాలు వెలుగులోకి వచ్చి, 106 జీవోలు, ఎస్సీ/ఎస్టీ సబ్‌ప్లాన్ సాధించుకున్నామని గుర్తుచేశారు. నేటికీ సమాజంలో కులం పేరుతో దాడులు, వేధింపులు కొనసాగడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సంక్షేమ హాస్టళ్లలో మెస్ ఛార్జీలు పెంచి, భోజనం, తాగునీరు సహా కనీస వసతులు కల్పించాలని, పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందే వరకు పోరాటాలు ఆగవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట శ్రీనివాస్, పవన్ కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# రింగరిట్ గ్రామానికి వెంటనే రోడ్డు, వంతెన నిర్మించాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొయిరే ప్రకాష్

**ఉద్యమ కెరటం, వాంకిడి :**
వాంకిడి మండలంలోని రింగరిట్ గిరిజన గ్రామాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు సందర్శించి, స్థానిక ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొయిరే ప్రకాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా రింగరిట్ లాంటి గిరిజన గ్రామాలు నేటికీ కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో పాటు, వర్షాకాలంలో స్థానిక వాగు ఉధృతంగా ప్రవహించి బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యాధికారులు గానీ, అంబులెన్సులు గానీ గ్రామానికి చేరుకోలేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వాగు పై వంతెన (బ్రిడ్జి) నిర్మించడంతో పాటు, గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గిరిజనుల రవాణా కష్టాలను శాశ్వతంగా తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వాంకిడి మండల కార్యదర్శి కొదురుపాక మహేష్ , నాయకులు ప్రవీణ్, రాందాస్ , గ్రామస్థులు పాల్గొన్నారు.



# గాంధీజీ ఆశయాలతో సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

**సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** గాంధీజీ ఆశయాలతో సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా సత్తుపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో, మెయిన్ రోడ్డులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ సత్యం, అహింస, శాంతి మార్గాలను అనుసరిస్తూ దేశ స్వాతంత్ర్యం కోసం విశేష కృషి చేశారని అన్నారు. గాంధీజీ చూపిన మార్గాలు నేటికీ సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా శాంతియుత, స్వచ్ఛమైన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం, కమల్ పాషా, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు బొంతు వేణు, సుమలత, మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# గోపాల్నగర్లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని గోపాల్నగర్ గ్రామపంచాయతీలో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గాట్ల నర్సయ్య మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ అధ్యక్షతన వీబీ-గ్రామ్జీ, వీజీఎల్పీ ప్లానింగ్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. గ్రామ అవసరాలు, ప్రాధాన్యతలు, అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలపై ప్రజల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ సత్యనారాయణ, టీఏ రమేష్, ఉప సర్పంచ్ గాజుల సునీత, కార్యదర్శి సౌందర్య, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, మహిళలు, యువత, రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# వర్షా భావంతో ఎండుతున్న పంటలు.!

## విద్యుత్ కోతలతో రైతుల అవస్థలు
## సమయానికి వర్షాలు లేక పంటలకు తీవ్ర నష్టం



**ఉద్యమ కెరటం, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలో వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు అనుకూలించక, సమయానికి వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలపై ఆశలు పెట్టుకుని అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులకు ప్రస్తుతం పరిస్థితులు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి. పంటలకు అవసరమైన సమయంలో వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా ఎండిపోయిన పంటలను పశువులకు మేతగా వేయాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇదిలా ఉండగా, పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ సరఫరాపైనే ఆధారపడుతున్న రైతులకు విద్యుత్ సరఫరా కోతలతో ఇబ్బందికరంగా మారిందని ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించడంతో సాగునీటి విషయంలో కొంత భరోసా ఉండేదని, ప్రస్తుతం వ్యవసాయానికి సుమారు ఏడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా ఇవ్వడంతో పంటలకు సకాలంలో నీరందించడం కష్టంగా మారిందని పేర్కొంటున్నారు. వర్షాభావం ఒకవైపు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు మరోవైపు తమను తీవ్రంగా నష్టాల్లోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల పరిస్థితిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని నిరంతరాయంగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు. ఎండిపోయిన పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని, పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రషీద్ ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కూడ్మేత విశ్వనాథ్, కొమురంభీం జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ సుద్దాల శ్రీనివాస్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మహాత్మా గాంధీ అహింసా సిద్ధాంతాలు, సత్యనిష్ఠ, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన సేవలను స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కొట్నాక దౌలాత్రావు, ప్రధాన కార్యదర్శి తుమ్రం కోటేష్, మండల కార్యదర్శులు షేక్ ఇస్లాం, మడావి కృష్ణ, అడా సేడ్మారావు, షేక్ రహీం, భూతలే కిరణ్, మాజీ ఉప సర్పంచ్ షేక్ అబ్బు, లక్ష్మణ్ పటేల్, సయ్యద్ వసీమ్, అహ్మద్ ఖాన్, ముబారక్, మేశ్రం ఇంద్రు తదితరులు పాల్గొన్నారు.

# దేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ సేవలు చిరస్మరణీయం

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. మహాత్మా గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ జ్యోతితో కలిసి ప్రజ్వలన చేశారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గంలో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, మైనింగ్ ఏడీ క్రాంతి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్యతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీఐ కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** సమాచార హక్కు చట్టం–2005ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, చట్టం అమలుకు సంబంధించి సమన్వయం, పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేసేందుకు జిల్లా స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీలో ఇద్దరు ఆర్టీఐ కార్యకర్తలను నామినేషన్, రొటేషన్ పద్ధతిలో సభ్యులుగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ఆసక్తి, అర్హత కలిగిన ఆర్టీఐ కార్యకర్తలు కమిటీలో సభ్యులుగా సేవలందించేందుకు ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను ప్రజా సమాచార అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా కలెక్టర్ కార్యాలయం మంచిర్యాల చిరునామాకు వ్యక్తిగతంగా అందజేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా ఇద్దరు ఆర్టీఐ కార్యకర్తలను కమిటీ సభ్యులుగా నామినేట్ చేయనున్నట్లు వివరించారు.

# మండల సమాఖ్య సభ్యులకు గ్రేడింగ్పై శిక్షణ



**ఉద్యమ కెరటం, మద్నూర్:** మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల పాలకవర్గ సభ్యులకు శుక్రవారం గ్రేడింగ్ విధానంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐకేపీ ఏపీఎం జగదీష్ కుమార్ తెలిపారు. ఈ శిక్షణలో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు శృతి, శారద సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘాల గ్రేడింగ్కు సంబంధించిన ఏడు రకాల కొలమానాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. సంఘాల సమావేశాల నిర్వహణ, సభ్యుల హాజరు, తప్పనిసరి పొదుపులు, ఆన్లైన్ లావాదేవీలు, సభ్యుల రుణాల చెల్లింపులు, బ్యాంకులు, స్త్రీనిధి సంస్థలకు చెల్లింపులు తదితర అంశాల ఆధారంగా మార్కులు కేటాయించే విధానాన్ని వివరించారు. కేటాయించిన మార్కుల ఆధారంగా సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలను ఏ, బీ, సీ గ్రేడ్లుగా విభజిస్తారని తెలిపారు. గ్రేడింగ్ ఆధారంగానే ఆయా సంఘాలకు నిధులు మంజూరవుతాయని పేర్కొన్నారు. సభ్యులు నిబంధనలను పాటిస్తూ సంఘాల కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు హసీనా బీ, కార్యదర్శి ప్రేమల, కోశాధికారి అనీషా, వివిధ గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# డోంగ్లీ మధన్ హిప్పరగాలో గాంధీ జయంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, డోంగ్లీ:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను డోంగ్లీ మధన్ హిప్పరగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాచావార్ లక్ష్మణ్ పటేల్ కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతిఒక్కరూ ఆచరించాలని, స్వచ్ఛత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పవన్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన అభ్యర్థులకు ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణ

**ఉద్యమ కెరటం, ఖమ్మం:** తెలంగాణ పోలీస్ శాఖ నిర్వహించే సబ్ ఇన్స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎం.ఫిరంగి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన 100 మంది గిరిజన అభ్యర్థులకు ఈ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణలో ఉచిత కోచింగ్తో పాటు స్టడీ మెటీరియల్, పరీక్షా విధానంపై అవగాహన, ఫిజికల్ ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో నివాసం ఉంటూ 2026 పోలీస్ నియామకాలకు దరఖాస్తు చేసుకున్న గిరిజన అభ్యర్థులు శిక్షణకు అర్హులని తెలిపారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించకూడదని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక స్క్రీనింగ్ టెస్ట్, మెరిట్తో పాటు ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కుల ఆధారంగా జరుగుతుందని వివరించారు. ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశాల మేరకు ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు ఐటీడీఏ భద్రాచలంలోని ఉపసంచాలకుల కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. 10న స్క్రీనింగ్ టెస్ట్, 12న ఫలితాలు, ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు 15వ తేది నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. దరఖాస్తుతో పాటు కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ మెమోలు, 2026 పోలీస్ నియామక నోటిఫికేషన్కు దరఖాస్తు చేసుకున్న రశీదు ప్రతిని జతచేయాలని సూచించారు. ఇతర వివరాల కోసం ఐటీడీఏ భద్రాచలం పీఐటీసీ ప్రిన్సిపాల్ ఎం.వీర నాయక్ను 8978477345 నంబర్లో సంప్రదించవచ్చని తెలిపారు. అర్హులైన గిరిజన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

## ఏడుగురు లబ్ధిదారులకు రూ.5.10 లక్షల ఆర్థిక సాయం



**ఉద్యమ కెరటం, బోథ్:** కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను ఏడుగురు లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. బోథ్ పట్టణంలో లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమ ఇళ్లకు వచ్చి ఆర్థిక సహాయం అందించినందుకు ఆడే గజేందర్కు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు తదితర అనుకోని పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే వారికి సహాయం అందుతుందని తెలిపారు. లింగంపల్లి వంశీకృష్ణకు రూ.1.75లక్షలు, బారె రాఘవేంద్రకు రూ.1.04 లక్షలు, ఫహిమునిస్స బేగంకు రూ.92వేలు, కుర్మే గంగాధర్కు రూ.24వేలు, మల్లెపూల నవీన్ కుమార్కు రూ.35వేలు, అవునూరి నవీన్ కుమార్కు రూ.30వేలు, మెరుగు సునీతకు రూ.50 వేలు చొప్పున చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ మండల అధ్యక్షుడు మేరుగు భోజన్న, సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్, ఉప సర్పంచ్ పూర్ణ విజయరెడ్డి, ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, పీఏసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల వేతనాలు చెల్లించాలి..

## భీం ఏజెన్సీని రద్దు చేయాలి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జి జి హెచ్ ) లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికుల పెండింగ్ వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ కార్మికులతో నిరంతరం పని చేయించుకుంటూ వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో 'భీం ఏజెన్సీ' పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్రతి నెలా పీఎఫ్ మొత్తాలను జమ చేయడంతో పాటు ఈఎస్ఐ సౌకర్యాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి నెలా పే స్లిప్‌లు, నాణ్యమైన యూనిఫామ్‌లు అందించాలని కోరారు. కార్మికుల సమస్యలను విస్మరిస్తున్న ప్రస్తుత భీం ఏజెన్సీని వెంటనే తొలగించి, నూతన ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాలని, ఈ వ్యవహారంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ పూర్తి బాధ్యత వహించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. యూనియన్ ప్రతినిధులతో చర్చించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంకు సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చారి, మద్దతు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి దివాకర్ గౌడ్, కార్యదర్శి భోగే ఉపేందర్, యూనియన్ ఆసిఫాబాద్ బ్రాంచి గౌరవ అధ్యక్షురాలు నీల, అధ్యక్షురాలు మమత, వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధర్, సితార్ బేగ్, ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షులు రాధా, తిరుపతి, నరేందర్, సహాయ కార్యదర్శులు సువర్ణ, అమృత, వాణి, ప్రమీల, కోశాధికారి మాధవి తదితర కార్మికులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి వేళ మద్యం నిషేధ తీర్మానం

- బెల్టాషాపుపై గ్రామస్థుల దాడి.. మద్యం పట్టివేత



**ఉద్యమ కెరటం, జైనూర్:** గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం జైనూర్ మండలం పట్నాపూర్ గ్రామంలో సంపూర్ణ మద్యం నిషేధానికి గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తీర్మానం చేసిన కొద్ది గంటల్లోనే గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న బెల్టాషాపు వెలుగులోకి రావడంతో గ్రామస్థులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి మద్యం స్వాధీనం చేసుకున్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని పట్నాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కందారే లక్ష్మీ బాలాజీ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ ప్రముఖులు, మహిళలు, యువత పాల్గొని గ్రామంలో శాంతిభద్రతలు, కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మద్యం విక్రయాలు, బెల్టాషాపులను పూర్తిగా నిషేధించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామసభ ముగిసిన కొద్దిసేపటికే అందుగూడ వద్ద ఓ ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గ్రామస్థులకు సమాచారం అందింది. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, మహిళలు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భీషే అమృత్ అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. గ్రామసభ తీర్మానాన్ని బేఖాతరు చేస్తూ మద్యం విక్రయించడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాధీనం చేసుకున్న మద్యంతో పాటు నిందితుడిని స్థానిక పోలీసులకు అప్పగించారు. గ్రామంలో ఎవరైనా బెల్టాషాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం విక్రయించినా కఠిన చర్యలు తప్పవని సర్పంచ్, పోలీసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెందూర్ లచ్చు, నగర్గోజే హనుమంతరావు, గోపాబాయి, గ్రామ పటేల్ పూసం హనుమంతరావు, పేసా యాక్ట్ మొబిలైజర్, పూసం భీంరావు, గ్రామ పోలీస్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం వైపు అడుగులు వేస్తే విజయం తథ్యం

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- జాతీయ స్థాయిలో 'మిస్ ఎర్త్ వాటర్ ఇండియా 2026' విజేత ప్రీతి ముండేకు సన్మానం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలోని మారుమూల ప్రాంతంలోని సాధారణ కుటుంబం నుంచి వచ్చి, జాతీయ స్థాయిలో 'మిస్ ఎర్త్ వాటర్ ఇండియా 2026' కిరీటాన్ని కైవసం చేసుకున్న ప్రీతి ముండే విజయం జిల్లాకే గర్వకారణమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మిస్ ఎర్త్ వాటర్ ఇండియా 2026' ప్రీతి ముండేతో పాటు ఆమె తల్లిదండ్రులు ఉమ-ప్రకాశ్ లను అతిథులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యువతులు ప్రీతిని రోల్ మోడల్గా తీసుకుని వారు ఎంచుకున్న రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అందంతో పాటు ఆరోగ్యం సైతం చాలా ముఖ్యమని, తమ ప్రస్తుత స్థితి గురించి ఆలోచించకుండా లక్ష్యం వైపు ముందుకు సాగితే విజయం ఖచ్చితంగా సాధ్యమవుతుందని అన్నారు. కుటుంబం నుంచే గొప్ప విజయ గాధలు బయలుదేరుతాయని తెలిపారు. ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ ఇంద్రవెల్లి మండలం హిరాపూర్ గ్రామానికి చెందిన ప్రీతి ముండే జాతీయ స్థాయి వేదికపై జిల్లా పేరును నిలబెట్టారని కొనియాడారు. చదువుతో పాటు సంస్కృతి, పురాణాలు, ఇతిహాసాలపై ఆమెకు ఉన్న విస్తృత అవగాహనే విజయాలకు బాటలు వేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, హీరాపూర్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# విబిజి రామ్జీ చట్టాన్ని రద్దు చేయాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబిజి రామ్జీ చట్టాన్ని రద్దు చేసి, పాత గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని యథావిధిగా పునరుద్ధరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్త పిలుపులో భాగంగా తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ సెంటర్ హమాలీ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారామ్ మాట్లాడుతూ విబిజి రామ్జీ చట్టంతో గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలులో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. కొత్త చట్టంలో పని దినాలను 100 నుంచి 125కు పెంచినప్పటికీ, కేంద్ర, రాష్ట్రాల మధ్య నిధుల వాటాలో 60:40 విధానం అమలు చేయడం ద్వారా రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరుగుతుందని పేర్కొన్నారు. ఉపాధిహామీ కూలీలకు పని కల్పించడంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మారుమూల గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల్లో నెట్వర్క్ సమస్యల కారణంగా ఆన్లైన్ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతపురి లక్ష్మణ్, తాండూర్ మల్లేష్, తొగరి శీను, రవీందర్, చంద్రగిరి తిరుపతి, ఇందూరు మల్లేష్, కామెరా బాబు, కేవీపీఎస్ తాండూర్ మండల అధ్యక్షుడు దుర్గం నాన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను గంభీరావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ చేసిన సేవలను, ఆయన అనుసరించిన సత్యం, అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలను నాయకులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, గ్రామ స్వరాజ్యం వంటి విలువలను ప్రతిఒక్కరూ ఆచరించాలని అన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రత, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లుగారి పద్మ, ఈవో వీనిల్ రెడ్డి, ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకరరెడ్డి, ఈజీఎస్ ఫీల్డ్ ఆఫీసర్ ఎర్రోళ్ల శంకర్, వార్డు సభ్యులు రెడ్డి మల్ల రాజనర్సు, ఎగదండి అర్జున్, గ్యార దేవరాజ్, పిట్ల శ్రీమతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మల తిరుపతిగౌడ్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మల్యాల రాజ్వీర్, మండల ఉపాధ్యక్షులు తహేర్, బంగ్లా రాజుగౌడ్, టేకుమల ప్రవీణ్, ముస్తఫానగర్ సీనియర్ నాయకుడు శివంది శ్రీనివాస్, యువ నాయకుడు దేశెట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖైదీల సంస్కరణనే ధ్యేయం

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- జిల్లా జైలులో ఘనంగా ఖైదీల సంక్షేమ దినోత్సవం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఖైదీల సంస్కరణే ధ్యేయమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్థానిక జిల్లా జైలులో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమానికి వరంగల్ రేంజ్ ప్రిజన్స్ డిఐజి ఎం.సంపత్, ఎస్పీ అఖిల్ మహాజన్ లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జైళ్లలోని ఖైదీల పునరావాసం, వారిలో సానుకూల పరివర్తన తీసుకురావడానికి అధికారులు నిరంతరం కృషి చేయాలని అన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పులతో కుటుంబాలకు దూరంగా ఉండడమే కాకుండా మానసికంగా, ఆర్థికంగా నష్టపోవడం జరుగుతుందని అన్నారు. ప్రతిరోజు యోగ, పుస్తక పఠనం వంటివి దినచర్యగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. జైలు జీవితం ఖైదీల జీవితాల్లో మార్పునకు వేదిక కావాలని, సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలని సూచించారు. వరంగల్ రేంజ్ ప్రిజన్స్ డిఐజి ఎం.సంపత్ మాట్లాడుతూ ఖైదీలలో నైతిక విలువలను పెంపొందించడానికి, వారు సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి జైలు అధికారులు చేస్తున్న సేవలను కొనియాడారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరస్థుల పునరావాసంలో పోలీసు, జైళ్ల శాఖల సమన్వయం ఎంతైనా అవసరమని అన్నారు. అనంతరం ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఖైదీలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.గోపిరెడ్డి, డీఎంహెచ్ఓ సాధన, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి.హుస్సేన్, జైలర్ ఎన్.చంద్రశేఖర్, ఖైదీలు, జైలు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** బీసీల జనాభా, సామాజిక ప్రాతినిధ్యానికి అనుగుణంగా రాజకీయ అవకాశాలు కల్పించాలని మున్నూరుకాపు సంఘం పటేల్స్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాగజ్నగర్ ద్వారకానగర్లోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు కేవలం ఎన్నికల్లో ఓట్లు వేసే వర్గంగా కాకుండా పాలనలో నిర్ణయాలు తీసుకునే స్థాయిలో భాగస్వామ్యం కల్పించాలని అన్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి పదవుల్లో బీసీలకు సముచిత వాటా కల్పించాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు కల్పించే రాజకీయ ప్రాతినిధ్యంపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని అన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం కాకుండా బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించేందుకు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విషయంలో తీసుకున్న చర్యలను స్పష్టం చేయాలని కోరారు. ఇటీవల ప్రకటించిన రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాల్లో బీసీలకు అవకాశం ఎందుకు కల్పించలేదో కాంగ్రెస్ నాయకత్వం సమాధానం చెప్పాలని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్తో పాటు ఇతర పార్టీలు కూడా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యంపై తమ వైఖరిని వెల్లడించాలని కోరారు. ప్రతి ప్రధాన రాజకీయ పార్టీ బీసీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్లో రూ.10వేల కోట్లు కేటాయించి, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని కోరారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్కు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ ప్రాంతానికి ప్రాతినిధ్యం పెంచాలని కోరారు. బీసీ మహిళా నాయకురాలు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన అంశంపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అన్నారు. బీసీలు ఎవరి దయా దాక్షిణ్యాల కోసం ఎదురుచూడకుండా తమ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, పాలనలో భాగస్వామ్యం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించే స్థాయికి వచ్చారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొలిశెట్టి మహేష్, జిల్లా కార్యదర్శి అంగాల తిరుపతి, సిర్పూర్ తాలూకా అధ్యక్షుడు దెబ్బటి జలపాతి, కాగజ్నగర్ మండల యూత్ అధ్యక్షుడు పార్వతి సురేష్, మండల ప్రధాన కార్యదర్శి సైదాం అశోక్, పట్టణ యూత్ అధ్యక్షుడు చిట్టంపల్లి అనిల్, కోశాధికారి పులిశెట్టి వెంకటేష్, కొంగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్తో భార్యాభర్తల మృతి

- అడవి జంతువుల నుంచి పంట రక్షణకు ఏర్పాటు చేసిన వైరు తగలడంతో ప్రమాదం





**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** వ్యవసాయ పొలంలో అడవి జంతువుల నుంచి పంటను రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తగలడంతో భార్యాభర్తలు విద్యుత్ షాక్కు గురై మృతిచెందిన విషాద ఘటన గంభీరావుపేట మండల కేంద్రం పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేటకు చెందిన గంట దేవయ్య (65), అతని భార్య గంట లక్ష్మి (58) గ్రామ పరిధిలోని ఓ వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. పంటను అడవి జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు ప్రతిరోజూ పొలం వద్దకు వెళ్లి పరిశీలించేవారు. ఈ క్రమంలో అడవి జంతువులు పొలంలోకి రాకుండా అడ్డుకునేందుకు స్టార్టర్ డబ్బా నుంచి విద్యుత్ వైరు తీసి పొలం చుట్టూ ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**పొలానికి వెళ్లి తిరిగిరాని దంపతులు..**

ఈనెల 1న సాయంత్రం దేవయ్య, లక్ష్మి దంపతులు వ్యవసాయ పొలానికి వెళ్లారు. అయితే శుక్రవారం గొల్ల నిశాంత్ పొలం వైపు వెళ్లగా భార్యాభర్తలు విద్యుత్ షాక్కు గురై మృతిచెంది ఉండటాన్ని గుర్తించాడు. వెంటనే వారి కుమార్తె భాగ్యలక్ష్మికి సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సీఐ వెంకటేష్, ఎస్సై శ్రీకాంత్, ఏఎస్సై దేవేందర్ రెడ్డి ఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రమాదం ఏ విధంగా జరిగిందనే అంశంపై విచారణ చేపట్టారు. మృతుల కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పంటను అడవి జంతువుల నుంచి రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తగలడంతోనే తన తల్లిదండ్రులు మృతిచెందారని, వారి మరణంపై తమకు ఎలాంటి అనుమానం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.



# గ్రామ అవసరాలకు అనుగుణంగా పనుల నిర్వహణ

**జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య సూచించారు. శుక్రవారం జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలో స్వచ్ఛత హి సేవలో భాగంగా నిర్వహించిన గ్రామసభకు ఎంపీడీఓ శ్రీపతి బాపుతో కలిసి హాజరయ్యారు. గాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, ఉపాధిహామీ పనుల ప్రణాళిక, మౌలిక వసతుల కల్పనపై గ్రామసభలో చర్చించి కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. వీబీజీ రామ్జీ పథకం కింద గుర్తించిన 375 రకాల పనుల్లో గ్రామానికి అవసరమైన వాటిని గ్రామసభ ద్వారా ఎంపిక చేసి ప్రాధాన్యతతో చేపట్టాలని అన్నారు. జాబ్కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో శాశ్వత మౌలిక వసతులు ఏర్పడేలా పనులను ఎంపిక చేయాలన్నారు. వర్షాభావం, నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని వాటర్హార్వెస్టింగ్, చెక్డ్యామ్లు, ఫీడర్చానళ్ల శుభ్రత, ఇంకుడు గుంతలు, బోర్వెల్ రీచార్జ్ నిర్మాణాలు, రూఫ్టాప్ వాటర్హార్వెస్టింగ్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ భవనం వద్ద వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేయాలని, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వాడుక నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల ఆరోగ్యం, శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని తెలిపారు. అనంతరం వేలాల గ్రామ సమీపంలోని గోదావరి నది తీరంలో 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు రూ.14.30 కోట్ల అంచనా వ్యయంతో మూడు ఎకరాల విస్తీర్ణంలో చేపట్టనున్న పుష్కర ఘాట్, అభివృద్ధి పనులు, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రాంతాలను పరిశీలించారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు అవసరమైన రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గట్టు మల్లన్న స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ఆలయ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల, వేలాల సర్పంచులు బల్ల వెంకటేష్, దేగ స్వప్న, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గాంధీ చూపిన శాంతి మార్గాలు ఆచరణీయం

**జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి ఆచరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి చంద్రయ్య హాజరయ్యారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మా గాంధీ కీలకపాత్ర పోషించారని తెలిపారు. సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహం వంటి సిద్ధాంతాలను అనుసరించి స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపారని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన అహింసా మార్గం, సత్యనిష్ఠ, నిరాడంబర జీవనం, దేశసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజాసేవలో నిజాయితీ, బాధ్యత, పారదర్శకత వంటి విలువలను పాటించాలని సూచించారు. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోస్టర్ సవరణ సాధన మహాసభను విజయవంతం చేయాలి



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** విద్య, ఉద్యోగాలు, పదోన్నతుల్లో రోస్టర్ విధానం కారణంగా మాల జాతికి జరుగుతున్న అన్యాయాన్ని సరిచేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న హైదరాబాద్లో నిర్వహించనున్న రోస్టర్ సవరణ సాధన మహాసభను విజయవంతం చేయాలని మాలల ఐక్యవేదిక గంభీరావుపేట మండల అధ్యక్షుడు ఎడబోయిన రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ మాల సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి రోస్టర్ విధానంలో జరుగుతున్న అన్యాయాన్ని సవరించాలని కోరుతున్నాయని తెలిపారు. మాలలకు విద్య, ఉద్యోగాలు, ఉద్యోగోన్నతుల్లో న్యాయం జరిగేలా రోస్టర్ విధానాన్ని సవరించి, మాలలకు సంబంధించిన 5 శాతం రిజర్వేషన్ను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్లో నిర్వహించే మహాసభకు గంభీరావుపేట మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాలలు, మాల అనుబంధ కుల సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మాల సంఘాలు, మండల కమిటీలు, ఉద్యోగ సంఘాల నాయకులు, కార్యకర్తలు మహాసభకు హాజరై తమ ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశారు. మాలల డిమాండ్ల సాధన కోసం సంఘటితంగా ముందుకు సాగాలని, రోస్టర్ సవరణ జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

# హత్నూరలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య, ఉప సర్పంచ్ మానస రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ దేశానికి అందించిన సేవలు, ఆయన పాటించిన సత్యం, అహింస, శాంతి సిద్ధాంతాలు ప్రజలకు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ పోషించిన పాత్రను స్మరించుకోవడంతో పాటు, ఆయన ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. గ్రామంలో స్వచ్ఛతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. గాంధీజీని కేవలం జయంతి రోజున స్మరించుకోవడం కాకుండా, ఆయన చూపిన సత్యం, అహింస, సేవా మార్గాలను జీవితంలో ఆచరించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బంది, గ్రామపెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్పై ఉక్కుపాదం

**నిబంధనలు ఉల్లంఘించి ఖనిజాలు కొనుగోలు చేస్తే లైసెన్సులు రద్దు**

**వెలుగుమట్లలో అక్రమ మైనింగ్ పై తనిఖీలకు కలెక్టర్ ఆదేశం**

**ఉద్యమ కెరటం, ఖమ్మం:** అక్రమ మైనింగ్ ను సహించేది లేదని, ఉక్కుపాదం మోపి, కఠిన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖమ్మం సమీపంలోని వెలుగుమట్ల ప్రాంతంలో అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం, రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశానుసారం రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులచే ఉమ్మడిగా తనిఖీలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. వెలుగుమట్ల పార్క్ సమీపంలోని ప్రైవేట్ వెంచర్ పట్టా భూముల్లో స్థానికంగా కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా బరైటీస్ ఖనిజాన్ని తవ్వుతున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు. చిన్న చిన్న గుంతలు తీసి, లభించిన బోల్డర్లను పగలగొట్టి (చిప్పింగ్ చేసి) ట్రాక్టర్ల ద్వారా పక్కనే ఉన్న మినరల్ డీలర్లకు అమ్ముతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. మైనింగ్ అధికారులు, ఖమ్మం అర్బన్ మండల తహశీల్దార్ తో కలిసి అక్రమ రవాణా జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి, తవ్వకాల కొలతలను నమోదు చేసుకున్నారని, ఈ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న పట్టాదారులను, బాధ్యులను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేసినట్లు తెలిపారు. అక్రమ మైనింగ్కు పాల్పడిన వారిపై నోటీసులు జారీ చేసి, భారీగా పెనాల్టీలు విధించనున్నట్లు, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఖనిజాన్ని కొనుగోలు చేసే మినరల్ డీలర్ల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**



# పర్వీన్ హూడాకు స్వర్ణం

## భారత్‌కు 13వ పతకం

**నాగోయా, అక్టోబరు 2 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** ఆసియా క్రీడల్లో భారత బాక్సర్ పర్వీన్ హూడా స్వర్ణ పతకం సాధించింది. మహిళల 65 కేజీల విభాగంలో చైనీస్ తైపెకు చెందిన చెన్ నిన్-చిన్‌పై 3-2 తేడాతో విజయం సాధించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో పర్వీన్ చివరి రౌండ్‌లో నిలకడగా పోరాడి విజయం అందుకుంది. తొలి రెండు రౌండ్లలో పోరు తీవ్రంగా సాగింది. ఇరువురు బాక్సర్లు పంచ్‌లతో ప్రతిదాడులకు దిగడంతో స్కోరు సమంగా మారింది. నిర్ణయాత్మక మూడో రౌండ్‌లో పర్వీన్ ప్రత్యర్థి దాడులను సమర్థంగా ఎదుర్కొంటూ కీలక పంచ్‌లు సంధించింది. చివరకు న్యాయనిర్ణేతలు 3-2తో పర్వీన్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. పర్వీన్ విజయం ద్వారా ఆసియా క్రీడల బాక్సింగ్‌లో భారత్‌కు ఒకే రోజున రెండో మహిళల స్వర్ణం లభించింది. అంతకుముందు లవ్లీనా బోర్గోహెయిన్ మహిళల 75 కేజీల విభాగంలో పసిడి పతకం సాధించింది. పర్వీన్ స్వర్ణంతో ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో 13వ స్వర్ణ పతకం చేరింది. పర్వీన్ హూడా గతంలోనూ ఆసియా క్రీడల్లో పతకం సాధించింది. 2022 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో ఆమె కాంస్యం గెలిచినా, అనంతరం డోపింగ్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన సస్పెన్షన్ కారణంగా ఆ పతకాన్ని కోల్పోయింది. ఈసారి అదే వేదికపై స్వర్ణం సాధించడం ఆమెకు కీలక పునరాగమనంగా నిలిచింది.

# సుజీత్ కల్కల్‌కు స్వర్ణం

## 2-9 నుంచి సంచలన విజయం

**నాగోయా, అక్టోబరు 2 (ఉద్యమ కెరటం):** ఆసియా క్రీడల్లో భారత రెజ్లర్ సుజీత్ కల్కల్ సత్తా చాటాడు. పురుషుల 65 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. ఫైనల్లో తజకిస్థాన్‌కు చెందిన అబ్దుల్‌మజీద్ కుదేవ్‌పై 10-9 తేడాతో అద్భుత విజయం నమోదు చేశాడు. దీంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్‌కు రెజ్లింగ్‌లో తొలి స్వర్ణం లభించింది. ఫైనల్లో సుజీత్ ఆరంభంలో తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ఒక దశలో 2-9తో వెనుకబడ్డాడు. అయితే చివరి దశలో అనూహ్యంగా పుంజుకున్న భారత రెజ్లర్ వరుస పాయింట్లు సాధించాడు. కీలక సమయాల్లో రెండు టేక్‌డౌన్లు సాధించి స్కోరును 10-9కు తీసుకెళ్లాడు. చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకుని స్వర్ణాన్ని సొంతం చేసుకున్నాడు. సుజీత్ విజయంతో పాటు అక్టోబరు 2న భారత్‌కు బాక్సింగ్, ఆర్చరీలోనూ స్వర్ణాలు దక్కాయి. పురుషుల 80 కేజీల బాక్సింగ్‌లో అంకుశ్ పంగల్ స్వర్ణం సాధించాడు. మహిళల 65 కేజీల్లో పర్వీన్ హూడా, 75 కేజీల్లో లవ్లీనా బోర్గొహైన్ కూడా పసిడి పతకాలు గెలిచారు. మహిళల రికర్వ్ టీమ్ ఆర్చరీలోనూ భారత్ స్వర్ణం సాధించింది. దీంతో భారత్ పతకాల సంఖ్య 75కు చేరగా.. అందులో 15 స్వర్ణాలు, 25 రజతాలు, 35 కాంస్యాలు ఉన్నాయిన్నాడు. ఇండియన్ రెజ్లర్‌ను అటాక్ చేయకుండా అడ్డుకున్నాడు. దీంతో 0-4 తేడాతో నితేశ్ ఓడిపోయాడు. గ్రీకో రోమన్ స్టయిల్ రెజ్లింగ్‌లో గతంలో ఇండియాకు రెండు సార్లు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. 1962లో జకర్తాలో జరిగిన గేమ్స్‌లో 52కేజీల విభాగంలో మాల్వా సింగ్, 97 కేజీల విభాగంలో గణపత్ అండాల్కర్ స్వర్ణ పతకాలు గెలిచారు. ఇవాళ జరిగిన ఫైనల్లో నితేశ్‌ను స్కోరింగ్ చేయకుండా జపనీస్ ప్లేయర్ నిలువరించాడు. ఫస్ట్ బౌట్‌ను 2-0 తేడాతో నకాజాటో ముగించాడు. లోకల్ ఫేవరేట్ అయిన నకాజాటో సెకండ్ బౌట్‌లో విజయవంతంగా నితేశ్‌ను నేలకూల్చాడు. దీంతో అతనికి 4-0 ఆధిక్యం లభించింది. చివరి నిమిషంలో నితేశ్ అటాక్ చేసినా.. నకాజాటో తన డిఫెన్స్ టెక్నిక్‌తో అడ్డుకున్నాడు.




# 44 ఏళ్ల నిరీక్షణకు తెర

## హాకీలో భారత్‌కు పసిడి!

### ఆసియా క్రీడల మహిళల హాకీలో రెండోసారి స్వర్ణం

### డిఫెండింగ్ ఛాంపియన్ చైనాపై 1-0తో భారత్ సంచలన విజయం




**గిఫు, అక్టోబర్ 2 (ఉద్యమ కెరటం):** నలభై నాలుగేళ్ల నిరీక్షణ ముగిసింది.. భారత మహిళల హాకీ జట్టు మళ్లీ ఆసియా రారాణిగా అవతరించింది. ఐచి-నగోయా ఆసియా క్రీడల మహిళల హాకీ ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను 1-0తో మట్టికరిపించి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. 1982 ఢిల్లీ ఆసియా క్రీడల తర్వాత భారత్‌కు మహిళల హాకీలో ఇదే తొలి పసిడి. మొత్తంగా ఇది రెండో స్వర్ణ పతకం. ఆరంభం నుంచే హోరాహోరీగా సాగిన ఫైనల్లో పదో నిమిషంలో లాల్‌రెమ్‌సియామి అద్భుతమైన రివర్స్ హిట్‌తో చైనా గోల్‌పోస్టును ఛేదించింది. తన 200వ అంతర్జాతీయ మ్యాచ్‌లోనే ఆమె చేసిన ఈ గోల్ భారత్‌కు చారిత్రక స్వర్ణాన్ని అందించడం విశేషం. ఆ తర్వాత చైనా వరుస దాడులతో ఒత్తిడి పెంచినా భారత రక్షణ విభాగం పట్టువదల్లేదు. చైనాకు లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను భారత గోల్‌కీపర్ సవిత అద్భుతంగా అడ్డుకోవడం మ్యాచ్‌లో కీలక మలుపుగా నిలిచింది. చివరి నిమిషాల్లో చైనా గోల్‌కీపర్‌ను కూడా బయటకు తీసి అదనపు ఆటగాడితో దాడికి దిగినా భారత డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. తుది విజిల్ మోగగానే భారత క్రీడాకారిణుల సంబరాలు మిన్నంటాయి.

### పసిడితో పాటు ఒలింపిక్స్ టికెట్

ఈ విజయం భారత్‌కు ఆసియా క్రీడల స్వర్ణంతోపాటు మరో భారీ బహుమతిని అందించింది. ఆసియా క్రీడల్లో విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల పురుషుల, మహిళల హాకీ విజేతలకు నేరుగా ఒలింపిక్ బెర్త్ లభిస్తుందని అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రకటించింది. 1982లో తొలిసారి ఆసియా క్రీడల మహిళల హాకీలో స్వర్ణం సాధించిన భారత్.. ఆ తర్వాత 1998, 2018లో ఫైనల్‌కు చేరినా రజతంతో సరిపెట్టుకుంది. ఇప్పుడు 44 ఏళ్ల తర్వాత మరోసారి అగ్రస్థానాన్ని అందుకుని చరిత్ర సృష్టించింది.

# 2023 ఓటమి గుర్తుంది..

## 2027 ప్రపంచకప్ గెలవాలి: గిల్

**కేప్‌టౌన్, అక్టోబరు 2 (ఉద్యమ కెరటం):** 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన ఓటమి ఇంకా గుర్తుందని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. ఆ లోటును 2027 ప్రపంచకప్‌లో పూడ్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నాడు. 2027 ప్రపంచకప్ తనకు, భారత జట్టుకు ఎంతో ప్రత్యేకమైనదని చెప్పాడు. 2023 ప్రపంచకప్‌లో భారత్ అద్భుతంగా ఆడినా.. ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోవడం బాధించిందని గిల్ పేర్కొన్నాడు. ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ ఫలితం మొత్తం టోర్నీపై ప్రభావం చూపుతుందని, ఫైనల్లో ఓడిపోవడం మరింత బాధాకరమని చెప్పాడు. అందుకే 2027 ప్రపంచకప్‌ను పూర్తి చేయాల్సిన పనిగా భావిస్తున్నామని వెల్లడించాడు. 2027 వన్డే ప్రపంచకప్ అక్టోబరు 2న ప్రారంభం కానుంది. భారత్ తన తొలి మ్యాచ్‌లోనే ఆస్ట్రేలియాను ఎదుర్కోనుంది. అక్టోబరు 7న కేప్‌టౌన్‌లో ఈ మ్యాచ్ జరగనుంది. 2023 ప్రపంచకప్ ఫైనల్లోనూ భారత్-ఆస్ట్రేలియానే తలపడగా.. అహ్మదాబాద్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయం సాధించింది.దేశం తరఫున ప్రపంచకప్‌లో ఆడే అవకాశం కెరీర్‌లో పరిమితంగానే లభిస్తుందని గిల్ అన్నాడు. అందుకే ప్రతి ప్రపంచకప్ తనకు ప్రత్యేకమేనని పేర్కొన్నాడు. కెప్టెన్సీ చిన్నప్పటి తన ప్రధాన లక్ష్యం కాదని, భారత్ తరఫున ఆడి జట్టును గెలిపించడమే తన అసలు కోరిక అని తెలిపాడు. వ్యక్తిగత రికార్డులు, ర్యాంకింగ్స్ కంటే జట్టు విజయం తనకు ముఖ్యమని గిల్ స్పష్టం చేశాడు.




# ఫజల్‌హక్ ఫరూఖీకి జాక్‌పాట్

### రూ.3.6 కోట్లకు అమ్మకం

**దుబాయ్, అక్టోబరు 2 (ఉద్యమ కెరటం):** అంతర్జాతీయ లీగ్ టీ20-2026 వేలంలో అఫ్గానిస్థాన్ పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీకి భారీ ధర పలికింది. ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్ ఫరూఖీని 3,80,000 అమెరికన్ డాలర్లకు.. అంటే సుమారు రూ.3.6 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో ఐఎల్‌టీ20 చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడైన ఆటగాడిగా ఫరూఖీ రికార్డు సృష్టించాడు. ఫరూఖీకి ముందు ఈ రికార్డు వెస్టిండీస్ ఆటగాడు ఆండ్రీ ఫ్లెచర్ పేరిట ఉండేది. ఐఎల్‌టీ20 నాలుగో సీజన్ వేలంలో ఫ్లెచర్‌ను ఎంఐ ఫ్రాంచైజీ 2,60,000 అమెరికన్ డాలర్లకు.. దాదాపు రూ.2.45 కోట్లకు కొనుగోలు చేసింది. తాజాగా ఫరూఖీ కోసం ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్ అంతకంటే భారీ మొత్తాన్ని వెచ్చించి ఆ రికార్డును అధిగమించింది.ఇదే వేలంలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, అఫ్గానిస్థాన్ వికెట్‌కీపర్ బ్యాటర్ రహ్మానుల్లా గుర్బాజ్ కూడా భారీ ధర పలికారు. లివింగ్‌స్టోన్‌ను 3,50,000 డాలర్లకు.. సుమారు రూ.3.36 కోట్లకు గల్ఫ్ జెయింట్స్ దక్కించుకుంది. గుర్బాజ్‌ను 3,10,000 డాలర్లకు.. దాదాపు రూ.3 కోట్లకు అదే జట్టు రైట్-టు-మ్యాచ్ అవకాశాన్ని ఉపయోగించి సొంతం చేసుకుంది. దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ కోసం కూడా ఫ్రాంచైజీల మధ్య పోటీ నెలకొంది. చివరకు దుబాయ్ క్యాపిటల్స్ అతడిని 3,00,000 అమెరికన్ డాలర్లకు కొనుగోలు చేసింది. ఫరూఖీకి దక్కిన భారీ ధరతో ఐఎల్‌టీ20 వేలంలో నాణ్యమైన పేసర్లకు ఉన్న డిమాండ్ మరోసారి స్పష్టమైంది.




# వర్షం పడితే భారత్, పాక్‌కు సంయుక్త స్వర్ణం

**నాగోయా, అక్టోబరు 2 (ఉద్యమ కెరటం):** ఆసియా క్రీడలు-2026 పురుషుల క్రికెట్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య స్వర్ణ పతక పోరుకు రంగం సిద్ధమైంది. అక్టోబరు 3న జరిగే ఈ ఫైనల్‌కు వర్షం ముప్పు ఉండటంతో నిర్వాహకులు కీలక నిబంధనను ప్రకటించారు. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా రద్దై ఫలితం తేలకపోతే భారత్, పాకిస్థాన్‌లను సంయుక్త విజేతలుగా ప్రకటించి ఇరు జట్లకూ స్వర్ణ పతకాలు అందజేస్తారు. ఫైనల్‌కు ప్రత్యేకంగా రిజర్వ్ డే కేటాయించలేదు. నిర్ణీత రోజునే మ్యాచ్ ఫలితం తేలాల్సి ఉంటుంది. కనీసం ఐదు ఓవర్ల చొప్పున ఆట సాధ్యమైతే డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ పద్ధతిలో విజేతను నిర్ణయిస్తారు. అలా కనీస ఆట కూడా సాధ్యం కాకపోతే మ్యాచ్‌ను 'నో రిజల్ట్'గా ప్రకటించి రెండు జట్లకూ స్వర్ణం పంచుతారు. గత ఆసియా క్రీడల్లో ఫైనల్ రద్దైనప్పుడు మెరుగైన సీడింగ్ ఆధారంగా భారత్‌ను విజేతగా ప్రకటించగా.. ఈసారి ఆ విధానాన్ని మార్చారు. మ్యాచ్ టై అయితే సూపర్ ఓవర్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. అయితే వాతావరణ పరిస్థితుల కారణంగా సూపర్ ఓవర్ కూడా నిర్వహించే అవకాశం లేకపోతే ఫైనల్ ఫలితం నిబంధనల ప్రకారం నిర్ణయించాల్సి ఉంటుంది. భారత్ సెమీఫైనల్లో శ్రీలంకను ఓడించగా.. పాకిస్థాన్ బంగ్లాదేశ్‌పై విజయం సాధించి తుదిపోరుకు చేరాయి. అక్టోబరు 3న జపాన్‌లోని నిషిన్‌లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఈ మ్యాచ్ జరగనుంది.



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శనివారం
3 అక్టోబర్ 2026



# మూడుసార్లు తప్పా

## అక్షర హాసన్ ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబరు 2 (ఉద్యమ కెరటం): సినీ కుటుంబం నుంచి వచ్చిన వారికి అవకాశాలు సులభంగా వస్తాయని చాలామంది భావిస్తుంటారు. అయితే తన ప్రయాణం మాత్రం అందుకు భిన్నంగా సాగిందని నటి అక్షర హాసన్ తెలిపారు. లోకనాయకుడు కమల్ హాసన్, నటి సారికల కుమార్తె, శ్రుతి హాసన్ సోదరి అయిన అక్షర.. తాజాగా సైరస్ బ్రూచా పాడ్‌కాస్ట్‌లో తన వ్యక్తిగత జీవితం, చదువు, సినీ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సినీ నేపథ్యం ఉన్న కుటుంబంలో పుట్టినప్పటికీ తాను నేరుగా నటిగా కెరీర్ ప్రారంభించలేదని అక్షర చెప్పారు. తొలుత స్నేహితుల సంగీత వీడియోలకు నృత్య కొరియోగ్రఫీ చేసినట్లు తెలిపారు. సినిమాలపై ఆసక్తి పెరగడంతో సహాయ దర్శకురాలిగా పనిచేశానని వెల్లడించారు. వాస్తవానికి తనకు దర్శకత్వంపై ఎక్కువ ఆసక్తి ఉందని, భవిష్యత్తులో కచ్చితంగా మెగాఫోన్ పట్టి సినిమా తెరకెక్కిస్తానని పేర్కొన్నారు. నటనలోకి అడుగుపెట్టడం కూడా తన ప్రయాణంలో ఓ ప్రయత్నమేనని అక్షర తెలిపారు. నటిగా తనను తాను నిరూపించుకున్నప్పటికీ దర్శకత్వం చేయాలన్న కోరిక మాత్రం అలాగే ఉందని చెప్పారు. తన విద్యాభ్యాసం గురించి కూడా అక్షర ఎలాంటి దాపరికం లేకుండా మాట్లాడారు. హైస్కూల్ చదువులో తాను పెద్దగా రాణించలేకపోయానని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో వరుసగా మూడుసార్లు విఫలమైనట్లు వెల్లడించారు. ఆ తర్వాత చదువుపై ఆసక్తి తగ్గిపోయిందని, పాస్ కావడం కష్టంగా అనిపించడంతో చదువును మధ్యలోనే ఆపేశానని చెప్పారు. అయితే చదువులో ఎదురైన వైఫల్యాలు తన జీవితాన్ని ఆపలేదని అక్షర పేర్కొన్నారు. తనకు ఆసక్తి ఉన్న కళలు, సినిమాపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. తనకు నచ్చిన రంగంలో ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు చెప్పారు. కమల్ హాసన్, సారికల కుమార్తె కావడంతో తాము తప్పనిసరిగా నటనలోనే కొనసాగాలనే ఒత్తిడి కుటుంబంలో ఎప్పుడూ లేదని అక్షర వెల్లడించారు. తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకునే పూర్తి స్వేచ్ఛను తల్లిదండ్రులు ఇచ్చారని తెలిపారు. నటన ఇష్టం లేకపోతే మరో రంగంలో స్థిరపడాలని, తమకు నచ్చిన పని చేసుకోవచ్చని తల్లిదండ్రులు ప్రోత్సహించేవారని చెప్పారు. కుటుంబంలో సినిమాలకు సంబంధించిన విషయాలను చాలా సీరియస్‌గా చర్చిస్తామని అక్షర తెలిపారు. తాను నటించిన సన్నివేశాలు నచ్చకపోతే కుటుంబ సభ్యులు మొహమాటం లేకుండా తమ అభిప్రాయాన్ని చెబుతారని వెల్లడించారు. తప్పుల నుంచి నేర్చుకునే అవకాశం ఇస్తూ, వాటిని తామే గుర్తించేలా కుటుంబ సభ్యులు ప్రోత్సహించేవారని అక్షర పేర్కొన్నారు.



# సమంతకు హైకోర్టు రక్షణ

## డీప్‌ఫేక్‌లపై కీలక ఆదేశాలు

**ముంబై, అక్టోబరు 2 (ఉద్యమ కెరటం):** సినీ తారల పేరు, ఫొటోలు, గొంతు, రూపాన్ని అనుమతి లేకుండా కృత్రిమ మేధ సాయంతో ఉపయోగించి డీప్‌ఫేక్‌లు, మార్ఫింగ్ కంటెంట్ రూపొందించడం ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో నటి సమంత రూత్ ప్రభుకు బాంబే హైకోర్టులో మధ్యంతర ఊరట లభించింది. సమంత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి మాధవ్ జామ్దార్.. ఆమె పేరు, ఫొటో, గొంతు, వ్యక్తిత్వాన్ని అనధికారికంగా ఉపయోగించిన అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించాలని సంబంధిత వేదికలను ఆదేశించారు. తన అనుమతి లేకుండా పలు వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాలు, కృత్రిమ మేధ వేదికల్లో తన గుర్తింపును ఉపయోగిస్తున్నారని సమంత పిటిషన్‌లో పేర్కొన్నారు. మార్ఫింగ్ చేసిన ఫొటోలు, డీప్‌ఫేక్ వీడియోలు, కృత్రిమ మేధతో రూపొందించిన గొంతు కంటెంట్, అభ్యంతరకర వీడియోలు, తన గుర్తింపును ఉపయోగించే సంభాషణ ఆధారిత కృత్రిమ మేధ సేవల గురించి ఆమె తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సమంత వ్యక్తిత్వ, ప్రచార హక్కులకు భంగం కలిగించేలా కంటెంట్ రూపొందించి ప్రచారం చేసినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని కోర్టు పేర్కొంది. గోప్యత, వ్యక్తిగత స్వేచ్ఛ, మానవ గౌరవానికి సంబంధించిన హక్కులతో పాటు కళాకారిణిగా ఆమెకు ఉన్న నైతిక హక్కులకూ చట్టపరమైన రక్షణ ఉందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గుర్తించిన అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించడంతో పాటు భవిష్యత్తులో సమంత పేరు, ఫొటో, గొంతు తదితర వ్యక్తిత్వ లక్షణాలను అనుమతి లేకుండా ఉపయోగించడాన్ని అడ్డుకునేలా మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగించి వ్యక్తుల రూపం, గొంతు, గుర్తింపును అనుమతి లేకుండా మార్చి లేదా వినియోగించి కంటెంట్ సృష్టించడం పెరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ వేదికలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ కేసు మరోసారి ముందుకు తెచ్చింది. సామాజిక మాధ్యమాలు, ఇతర మధ్యవర్తి వేదికలు అనధికారికంగా ప్రచారం అయ్యే కంటెంట్‌పై తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని కోర్టు పేర్కొంది. సమంత దాఖలు చేసిన కేసు తదుపరి విచారణ డిసెంబరు 10న జరగనుంది.

# ఉత్కంఠతో సాగే గ్రామీణ క్రైమ్ థ్రిల్లర్ 'తత్త్వం'

**హైదరాబాద్, అక్టోబరు 02 (ఉద్యమ కెరటం):** దినేష్ తేజ్, దాస్విక కింతలి ప్రధాన పాత్రల్లో అర్జున్ కోల దర్శకత్వంలో తెరకెక్కిన గ్రామీణ సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ 'తత్త్వం' ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సుక్కురెడ్డి, ఆనంద్ భారతి, జబర్దస్త్ కృష్ణ, భోగిరెడ్డి శ్రీనివాస్, ప్రమోదిని తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఎస్‌కే ప్రొడక్షన్, త్రయాధి ఇషానీ క్రియేషన్స్ పతాకాలపై వంశీ సీమకృతి నిర్మించారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుందో పరిశీలిద్దాం.

**కథా నేపథ్యం:** రామాపురానికి చెందిన మూర్తి, నాగమణి దంపతుల కుమారుడు సుధ మతిస్థిమితం లేని యువకుడు. అతడి వల్ల తల్లిదండ్రుల ప్రాణాలకే ప్రమాదమని ఒక జ్యోతిష్యుడు ముందే హెచ్చరిస్తాడు. అనూహ్యంగా ఆ దంపతులు దారుణ హత్యకు గురికావడంతో, గ్రామస్థులంతా సుధనే నిందితుడిగా భావించి అతడిపై దాడికి దిగుతారు. అదే సమయంలో పెళ్లి చూపుల కోసం గ్రామానికి వచ్చిన కానిస్టేబుల్ కల్యాణ్ (దినేష్ తేజ్)కు ఈ హత్యల దర్యాప్తు బాధ్యతను అధికారులు అప్పగిస్తారు. అయితే సుధ నిర్దోషి అని సౌమ్య (దాస్విక) బలంగా నమ్ముగా, స్థానిక వడ్డీ వ్యాపారి కిషోర్ బాబు మాత్రం సుధనే హంతకుడని వాదిస్తూ కేసును త్వరగా ముగించాలని పోలీసులపై ఒత్తిడి తెస్తాడు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు కల్యాణ్‌ను కేసు నుంచి తప్పించినప్పటికీ, అతడు వ్యక్తిగతంగా విచారణను కొనసాగిస్తాడు. అసలు సుధ తల్లిదండ్రులను హత్య చేసింది ఎవరు, సుధపై వచ్చిన ఆరోపణల్లో నిజమెంత, కిషోర్ బాబు ఎందుకు కేసును త్వరితగతిన ముగించాలని చూశాడు అనే విషయాల చుట్టూ మిగతా కథ తిరుగుతుంది.

**విశ్లేషణ:** మూఢనమ్మకాలు, గ్రామీణ రాజకీయాలు మరియు హత్యల నేపథ్యంతో కథను అల్లుకున్న దర్శకుడు అర్జున్ కోల, మతిస్థిమితం లేని యువకుడిని ప్రధానంగా చేసుకుని భావోద్వేగ సంఘర్షణను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. సాధారణ క్రైమ్ థ్రిల్లర్‌ల లాంటి పోలీస్ దర్యాప్తుతో పాటు సమాజం ఒక అమాయకుడి పట్ల చూపే వైఖరిని ఇందులో చక్కగా చూపించారు. తొలి భాగంలో పాత్రల పరిచయానికే ఎక్కువ సమయం కేటాయించడంతో కథనం కొంత నెమ్మదిగా సాగి సాగదీసినట్లు అనిపిస్తుంది. అయితే ద్వితీయార్థంలో వచ్చే ఊహించని మలుపులు, సస్పెన్స్ సన్నివేశాలు ప్రేక్షకుల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తాయి. కానిస్టేబుల్ కల్యాణ్ సమగ్రంగా కేసు చిక్కుముళ్లను విప్పే విధానం ఆకట్టుకుంటుంది. మొదటి భాగంలో కథనాన్ని మరికాస్త వేగవంతం చేసి ఉంటే సినిమా ప్రభావం మరింత పెరిగేది.




**నటీనటులు & సాంకేతిక విభాగం:**

కానిస్టేబుల్ కల్యాణ్ పాత్రలో దినేష్ తేజ్ సహజ సిద్ధమైన హావభావాలతో మెప్పించగా, సౌమ్యగా దాస్విక తన పరిధి మేరకు నటించింది. సుధ పాత్రలో నటించిన నటుడు మానసిక సంఘర్షణను, భావోద్వేగాలను అద్భుతంగా పండించారు. సాంకేతికంగా భరత్ పట్టి ఛాయాగ్రహణం గ్రామీణ వాతావరణాన్ని విజువల్‌గా చాలా సహజంగా ఆవిష్కరించింది. చైతన్ భరద్వాజ్ అందించిన నేపథ్య సంగీతం సస్పెన్స్ సన్నివేశాలకు ఊపునిచ్చింది. విప్లవ్ నైషదం ఎడిటింగ్ తొలి భాగంపై ఇంకాస్త దృష్టి పెట్టి ఉంటే బాగుండేది. మొత్తంగా, కొత్త కథాంశాలను, క్రైమ్ థ్రిల్లర్లను ఆస్వాదించే ప్రేక్షకులకు 'తత్త్వం' ఒక ఓ మోస్తరు గ్రామీణ థ్రిల్లర్‌గా అలరిస్తుంది. ప్రథమార్థంలో నెమ్మదిగా సాగే కథనాన్ని కొంత ఓపికతో చూస్తే, ద్వితీయార్థంలో వచ్చే మలుపులు వినోదాన్ని అందిస్తాయి.

# తెలంగాణ యాసలో సితార

**హైదరాబాద్, అక్టోబరు 2 (ఉద్యమ కెరటం):** సూపర్‌స్టార్ మహేశ్ బాబు కుమార్తె సితార ఘట్టమనేని సోషల్ మీడియాలో ఎప్పుడూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటారు. డ్యాన్స్ వీడియోలు, విహారయాత్రలకు సంబంధించిన పోస్టులతో ఇప్పటికే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న సితార.. తాజాగా మరో కారణంతో వార్తల్లో నిలిచారు. ఫహాద్ ఫాజిల్ నటించిన 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్' సినిమా ప్రచారంలో భాగంగా ఆమె చేసిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సితార ఇప్పటివరకు సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా ఆంగ్లంలో మాట్లాడే వీడియోల్లో కనిపించేవారు. అప్పుడప్పుడు తెలుగులో మాట్లాడినా.. తాజాగా మాత్రం అందుకు భిన్నంగా పక్కా తెలంగాణ యాసలో మాట్లాడి ఆకట్టుకున్నారు. 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్'లో మ్యాజిక్ చేసే పాత్రలో నటించిన సారా పాలేకర్‌తో కలిసి సితార ఈ ప్రచార వీడియోలో కనిపించారు. సారా మ్యాజిక్ ట్రిక్స్ చేస్తుండగా వాటిని చూస్తూ సితార ఇచ్చిన స్పందనలు సహజంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా 'ఆగు.. ఇటు రా', 'ఇట్లానా.. అట్లానా?' అంటూ ఆమె పలికిన మాటలు హైదరాబాద్, తెలంగాణ యాసను గుర్తు చేస్తున్నాయి. సహజమైన హావభావాలతో ఆమె మాట్లాడిన తీరు నెటిజన్లను ఆకర్షిస్తోంది. వీడియోలో సారా పాలేకర్.. తదుపరి విహారయాత్రకు ఎక్కడికి వెళ్లాలని అనుకుంటున్నావని సితారను అడుగుతుంది. అందుకు సితార 'మూన్‌కి వెళ్దాం.. ఆ తర్వాత మార్స్‌కి పోదాం' అంటూ సరదాగా సమాధానం ఇచ్చారు. ఆమె మాటతీరు, తెలంగాణ యాస, సహజమైన స్పందనలు వీడియోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహేశ్ బాబు అభిమానులతో పాటు సితారను సామాజిక మాధ్యమాల్లో అనుసరించే వారు ఈ వీడియోను ఆసక్తిగా చూస్తున్నారు. సాధారణంగా ఆంగ్లంలో ఎక్కువగా మాట్లాడే సితార.. ఇలా సహజమైన తెలంగాణ యాసలో మాట్లాడటం అభిమానులకు కొత్తగా అనిపించింది. ప్రస్తుతం ఈ వీడియోను పలువురు అభిమానులు పంచుకుంటూ సితార మాటతీరుపై స్పందిస్తున్నారు.



Printed, Published and Owned by MOHAMMAD ABDUL RAHEMAN, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273 Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717

## నేడు నేరడిగొండ మండలంలో
# ఆడే గజేందర్ పర్యటన



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ శనివారం నేరడిగొండ మండలంలో విస్తృతంగా పర్యటించనున్నారు. మండలంలోని పలు గ్రామాలు, తండాల్లో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. ఆడే గజేందర్ క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. ఉదయం 8 గంటలకు వడూర్ గ్రామంతో ప్రారంభమై 8.30 గంటలకు రాజుల్ తండా, 9 గంటలకు బుద్ధికొండ, 9.30 గంటలకు తేజాపూర్, 10 గంటలకు కిష్టాపూర్, 10.30 గంటలకు లింగట్ల గ్రామంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో నేరుగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకోనున్నారు. పర్యటనలో భాగంగా పార్టీ కార్యకలాపాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించనున్నారు. నియోజకవర్గ ఇన్చార్జి పర్యటన నేపథ్యంలో మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కోరాయి.

# ఎంభూరాలో గాంధీ జయంతి



**ఉద్యమ కెరటం, డోంగ్లీ:** ఎంభూరా గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యునుస్ పటేల్ మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతిఒక్కరూ ఆచరించాలని, స్వచ్ఛత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫహీమ్ పటేల్, వార్డు సభ్యులు సద్దాం పటేల్, ఆఫ్సార్ పటేల్, పంచాయతీ కార్యదర్శి షోయెబ్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గాంధీ ఆశయాలను ఆచరణలో పెట్టడమే
# నిజమైన నివాళి

### మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మహాత్మా గాంధీ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీ పార్క్, గాంధీ చౌక్, పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రపంచానికి చాటిచెప్పిన అహింస, సత్యం, శాంతి, స్వచ్ఛత వంటి విలువలు ఎప్పటికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, శాంతియుత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా స్వచ్ఛతను పాటిస్తూ, సత్య మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన అంగన్వాడీ భవనం పరిశీలన



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** మండల కేంద్రంలో వినియోగంలో లేని నూతన అంగన్వాడీ భవనాన్ని గుడిహత్నూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆడే శీల శుక్రవారం పరిశీలించారు. భవనం వినియోగంలోకి రాకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను ఆమె పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భవనం అందుబాటులో లేకపోవడంతో ఎదురవుతున్న సమస్యలను గుర్తించామని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులతో అవసరమైన మరమ్మతులు త్వరలోనే పూర్తి చేయించి భవనాన్ని వినియోగంలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఉప సర్పంచ్ నిఖిల్ లందాడే, వార్డు సభ్యులు రాజు తెలంగే, కె.అవినాష్, లక్ష్మీబాయి, అంగన్వాడీ టీచర్ ఛాయ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కలకు ఢిల్లీ 'ఓకే' చెప్పిన రోజు!

- అక్టోబర్ 3.. ప్రత్యేక రాష్ట్ర ప్రస్థానంలో చారిత్రక మైలురాయి
- 2013లో తెలంగాణ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం అధికారిక ఆమోదం
- దశాబ్దాల ఉద్యమం.. త్యాగాలు.. పోరాటాల అనంతరం కీలక ముందడుగు
- 2009 డిసెంబర్ 9 ప్రకటన నుంచి 2014 జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావం వరకు ఎన్నో మలుపులు
- పార్లమెంటు ఆమోదంతో సాకారమైన ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష




తెలంగాణ రాష్ట్ర సాధన చరిత్రలో అక్టోబర్ 3కు ప్రత్యేక స్థానం ఉంది. దశాబ్దాలుగా సాగిన ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను కార్యరూపంలోకి తీసుకొచ్చే ప్రక్రియలో 2013 అక్టోబర్ 3న కీలక అడుగు పడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు నాటి కేంద్ర మంత్రివర్గం అధికారికంగా ఆమోదం తెలిపింది. హైదరాబాద్‌ను పదేళ్లపాటు రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా ఉంచాలని కూడా నిర్ణయించింది. విభజనకు సంబంధించిన న్యాయ, పరిపాలనా అంశాలను పరిశీలించేందుకు కేంద్ర మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

### 1956లో విలీనం.. ఆ వెంటనే అసంతృప్తి

స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో తెలంగాణ ప్రాంతం నిజాం పాలనలోని హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉండేది. 1948 సెప్టెంబర్‌లో జరిగిన పోలీసు చర్య అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. అనంతరం హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా తెలంగాణ కొనసాగింది. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే తెలంగాణ ప్రాంతాన్ని అప్పటి ఆంధ్ర రాష్ట్రంతో కలిపి ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేశారు. అయితే తెలంగాణకు సంబంధించిన రక్షణలు, ఉద్యోగాలు, నీళ్లు, నిధులు తదితర అంశాలపై అసంతృప్తి పెరుగుతూ వచ్చింది. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. తెలంగాణ ప్రజా సమితి 1971 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంతంలోని 14 స్థానాల్లో 10 స్థానాలను గెలుచుకుంది. ఈ ఘట్టం ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు ఉన్న రాజకీయ బలాన్ని దేశం ముందుంచింది.




### 2001తో మలిదశ ఉద్యమం

2001 ఏప్రిల్ 27న కె.చంద్రశేఖర్‌రావు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేయడంతో ఉద్యమం కొత్త దశలోకి ప్రవేశించింది. సభలు, ఆందోళనలు, రాజకీయ కార్యక్రమాలతో ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ మళ్లీ జాతీయ రాజకీయాల్లో ప్రధాన అంశంగా మారింది. 2009 నవంబర్ 29న కేసీఆర్ ప్రారంభించిన ఆమరణ నిరాహార దీక్ష మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలక మలుపుగా నిలిచింది. ఉద్యమం తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో అదే ఏడాది డిసెంబర్ 9 రాత్రి అప్పటి కేంద్ర హోంమంత్రి పి.చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకటన అనంతరం సీమాంధ్ర ప్రాంతంలో నిరసనలు, ప్రజాప్రతినిధుల రాజీనామాలు మొదలయ్యాయి. కేంద్రం తదుపరి ప్రక్రియపై విస్తృత సంప్రదింపుల వైపు వెళ్లడంతో తెలంగాణలో ఉద్యమం మరింత ఉధృతమైంది. విద్యార్థులు, ఉద్యోగులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు వివిధ రూపాల్లో ఉద్యమాన్ని కొనసాగించాయి. 2010లో కేంద్రం జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయగా, ఆ కమిటీ తెలంగాణ అంశంపై ఆరు ప్రత్యామ్నాయాలను సూచించింది.

### జూలై 30 తీర్మానం.. అక్టోబర్ 3న కేబినెట్ ముద్ర

2013 జూలై 30న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా తీర్మానం చేసింది. హైదరాబాద్‌ను పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని ప్రతిపాదించింది. దీనికి కొనసాగింపుగా 2013 అక్టోబర్ 3న కేంద్ర మంత్రివర్గం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి అధికారికంగా ఆమోదం తెలిపింది. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రయాణంలో ఈ నిర్ణయం అత్యంత కీలకమైన రాజ్యాంగ--పరిపాలనా ముందడుగుగా నిలిచింది. కేంద్ర హోంశాఖ అధికారిక రికార్డులు కూడా అక్టోబర్ 3న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ విభజన, తెలంగాణ ఏర్పాటు నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. ఆ తర్వాత విభజన అంశాలను పరిశీలించేందుకు కేంద్ర మంత్రుల బృందం సమావేశాలు నిర్వహించింది. ఆస్తులు, అప్పులు, ఉద్యోగులు, విద్యుత్, నీటి పంపకాలు, రాజధాని తదితర అంశాలపై కసరత్తు జరిగింది.

### పార్లమెంటు నుంచి రాష్ట్రపతి భవన్ వరకు

2014 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. ఫిబ్రవరి 18న లోక్‌సభ, ఫిబ్రవరి 20న రాజ్యసభ బిల్లును ఆమోదించాయి. అనంతరం రాష్ట్రపతి ఆమోదంతో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 మార్చి 1న చట్టరూపం దాల్చింది. అధికారిక చట్ట ప్రతిలోనూ మార్చి 1, 2014 రాష్ట్రపతి ఆమోద తేదీగా నమోదైంది. చివరకు 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించింది. కేసీఆర్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో పది జిల్లాలుగా ఉన్న తెలంగాణ.. ప్రస్తుతం 33 జిల్లాలతో కొనసాగుతోంది.

**అలా.. 1969 ఉద్యమ జ్వాలల నుంచి మలిదశ పోరాటం వరకు, విద్యార్థుల నినాదాల నుంచి ఉద్యోగుల సమ్మెల వరకు, రాజకీయ నిర్ణయాల నుంచి పార్లమెంటు ఆమోదం వరకు సాగిన సుదీర్ఘ ప్రయాణంలో 2013 అక్టోబర్ 3.. తెలంగాణ కలకు కేంద్ర మంత్రివర్గం అధికారిక ముద్ర వేసిన చారిత్రక రోజుగా నిలిచిపోయింది.**




# రేపు రెడ్క్రాస్ సొసైటీ ఎన్నికలు

### జిల్లా మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ను కలిసిన అభ్యర్థి షేక్ షకీల్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ ఎన్నికల బరిలో నిలిచిన సామాజిక కార్యకర్త, కంటెస్ట్ నంబర్ 37 అభ్యర్థి షేక్ షకీల్ శుక్రవారం జిల్లా మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ను కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో తన వ్యూహాలు, రెడ్క్రాస్ ద్వారా చేపట్టబోయే సేవా కార్యక్రమాల గురించి చర్చించారు. ఈనెల 4న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని తనను గెలిపించాలని షేక్ షకీల్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



# బెజ్జూర్‌లో ఘనంగా గాంధీ జయంతి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను ప్రతిఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మహాత్మా గాంధీ జీవిత విశేషాలు, ఆయన సిద్ధాంతాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పొద్దు

**ఉద్యమ కెరటం, జైనూర్:** ఓటీపీ, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పవద్దని జైనూర్ సీఐ రమేష్ అన్నారు. జైనూర్ మండలం జంగం గ్రామంలో శుక్రవారం సైబర్ క్రైమ్పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్లైన్ మోసాలు, ఫోన్ కాల్స్ ద్వారా జరిగే మోసాలు, ఓటీపీ, ఏటీఎం, బ్యాంకు ఖాతా వివరాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, పాస్వర్డు, బ్యాంకు ఖాతా వివరాలు వెల్లడించకూడదని పేర్కొన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్లైన్కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మణ్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కుమ్రా చందు, మాజీ సర్పంచ్ కుమ్రా శంరావ్, వార్డు సభ్యులు రవి, కీర్తన్, లక్ష్మి, దాదేరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ‘మరసం’ లేకపోతే తెలంగాణ ఉద్యమమే లేదు

## మాజీ మంత్రి హరీష్ రావు

**ఉద్యమ కెరటం, హైదరాబాద్ :** కవులు అంటే కేవలం కవిత్వాన్ని వెలువరించేవారు మాత్రమే కాదని... మాటకు, పాటకు, ఆటకు ప్రాణం పోసే వారని క్రియాశీలకంగా నిరూపిస్తున్న మంజీరా రచయితల సంఘం (మరసం) భావితరానికి దిక్సూచి అని మాజీ మంత్రి, శాసనసభ ఉపనేత తన్నీరు హరీష్ రావు అన్నారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో, గోపాల్ రెడ్డి వేదికపై జరిగిన మంజీరా రచయితల సంఘం 40 ఏళ్ల వార్షికోత్సవ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత్వం అంటే వేడుక కాదని, ప్రజాపక్షంలో నిలబడడమని మరసం నిరూపించడం చారిత్రాత్మకమన్నారు. 40 ఏళ్లుగా ఒక సాహిత్య సంస్థను నడిపించడం కత్తి మీద సాము లాంటిదని పేర్కొన్నారు. నిర్బంధాలను, బెదిరింపులను, రాజ్య హింసను తట్టుకొని నిలబడిన మరసం సామాజిక సమస్యల పరిష్కారాన్ని భుజాల మీదికి ఎత్తుకుందని కొనియాడారు. మంజీరా రచయితల సంఘం లేకుంటే తెలంగాణ ఉద్యమం ప్రజ్వరిల్లేది కాదని, కవులను, రచయితలను, కళాకారులను, జర్నలిస్టులను ఏకం చేసి ఉద్యమాన్ని మలుపుతిప్పిన ఘనత మరసందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కోటి రూపాయల నగదు, ప్లాటును తిరస్కరించిన త్యాగశీలి, “నాగేటి సాలల్ల నా తెలంగాణ” పాటతో ప్రజల్లో ఎనలేని చైతన్యం కల్పించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిద్దారెడ్డి, ఉద్యమాన్ని ఉరకలెత్తించిన దేశపతి శ్రీనివాస్, 41 రోజుల సకల జనుల సమ్మె భేరితో పాలకులను కదిలించిన దేవి ప్రసాద్, జర్నలిస్టులను ఉద్యమంలో భాగస్వాములను చేసిన విరాహత్ అలీల కృషి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాదిరాళ్లని వివరించారు. సాహిత్యంలో ఏఐ ప్రవేశిస్తున్నప్పటికీ, హృదయం పెట్టి మట్టి వాసనలతో రాసిన కవిత్వం, సాహిత్యం మాత్రమే సజీవంగా ఉంటాయని విశ్వాసం వ్యక్తం చేశారు. పాశ్చాత్య దేశాల్లో అన్ని వర్గాల వారు పుస్తక పఠనం వైపు మరలుతుంటే, మన దేశంలో చిన్న పిల్లలు సైతం సెల్ ఫోన్లలో ఊగడం ఆందోళన కలిగిస్తోందని, పుస్తక పఠనాన్ని పెంపొందించాలని కోరారు. అలాగే ఉమ్మడి మెదక్ జిల్లాలో మంజీరా నదిపై చెక్ డ్యామ్‌లను నిర్మించి బీడు భూములను పచ్చగా మార్చామని, సాహిత్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ అకాడమీకి తాళం వేయడం విచారకరమని విమర్శించారు.







### ఆలోచింపజేసిన సాహిత్య సభలు, కవి సమ్మేళనం

ఈ మహాసభకు మరసం అధ్యక్షుడు రంగాచారి అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి సిద్ధంకి యాదగిరి నివేదిక సమర్పించారు. ‘సాహిత్యం – మహిళా దృక్పథం’ అంశంపై నెల్లుట్ల రమాదేవి, ‘సాహిత్యం – దళిత దృక్పథం’పై కోయి కోటేశ్వరరావు, ‘సాహిత్యం – ద్రావిడ దృక్పథం’పై జిలుకర శ్రీనివాస్ ప్రసంగించారు. అనంతరం 30 మంది కవులతో నిర్వహించిన కవి సమ్మేళనం సభికులను విశేషంగా ఆలోచింపజేసింది. సమావేశంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరం శంకరం, సీనియర్ పాత్రికేయులు కే. అంజయ్య, తోట అశోక్, కవులు పప్పుల రాజిరెడ్డి, అలాజిపూర్ కిషన్, భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రెస్ క్లబ్ వద్ద మరసం జెండాను ఆవిష్కరించి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. తెలంగాణ నలుమూలల నుంచి కవులు, రచయితలు, కళాకారులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.





## పీడితుల పక్షాన నిలబడటమే మరసం నైజం: నందిని సిద్దారెడ్డి

మంజీరా నది స్ఫూర్తితో ప్రారంభమైన మంజీరా రచయితల సంఘం ఎల్లప్పుడూ ప్రజల పక్షమే వహిస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, మరసం వ్యవస్థాపకులు డాక్టర్ నందిని సిద్దారెడ్డి స్పష్టం చేశారు. నిర్బంధాలను, అవరోధాలను ఎదుర్కొంటూ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ఉద్యమాలకు మరసం ప్రేరణగా నిలిచిందని తెలిపారు. పల్లెలతో మైకమై కవులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులలో స్ఫూర్తి నింపిందని చెప్పారు.

## జర్నలిస్టులకు, మరసంకు తల్లి-బిడ్డల అనుబంధం: విరాహత్ అలీ



మెతుకుసీమలో మంజీరా రచయితల సంఘంతో జర్నలిస్టులకు తల్లి-బిడ్డల బంధం ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ తెలిపారు. మరసం కవుల రచనలు వార్తలుగా, జర్నలిస్టుల వార్తలు కవితలుగా మారాయని పేర్కొన్నారు. నిర్బంధాలను ఎదుర్కొని జర్నలిస్టులు చేసిన పోరాటంలో మరసం అండగా నిలిచిందని, ఆ స్ఫూర్తితోనే 25 ఏళ్ల క్రితం జర్నలిస్టుల బతుకులపై “కలం రాగాలు” ఆడియో క్యాసెట్‌ను నిర్మించామని చెప్పారు.

## సమాజంలో స్తబ్దతను కవులు, రచయితలు బద్దలు కొట్టాలి: దేవి ప్రసాద్



సమాజంలో పెరుగుతున్న స్తబ్దతను కవులు, రచయితలు బద్దలు కొట్టాలని టీఎన్‌జీఓల సంఘం పూర్వాధ్యక్షుడు దేవి ప్రసాద్ పిలుపునిచ్చారు. మేధావుల మౌనం ప్రమాదకరమని, సంక్షోభాలను అధిగమించడానికి పోరాటాలు అవసరమని చెప్పారు. మరసం ఎల్లప్పుడూ ప్రజా పోరాటాలకు మద్దతుగా నిలిచిందని తెలిపారు.

## మరసం వ్యక్తి కేంద్రం కాదు... ప్రజా విషయ కేంద్రం

### ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

మంజీరా రచయితల సంఘం వ్యక్తి కేంద్రంగా కాకుండా వస్తువు, విషయము కేంద్రంగా పనిచేస్తుందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ చెప్పారు. ఒక లక్ష్యంతో, ఆశయంతో నడుస్తూ ఉద్యమాలకు ఆటగా, మాటగా, గొంతుగా మారిందని తెలిపారు. విభిన్న వ్యక్తులను, భావజాలాలను, సంస్థలను ఒక వేదికపైకి తీసుకువచ్చిన ఘనత మరసంది అని, తన సాహిత్య, సాంస్కృతిక వికాసానికి ఈ సంస్థే పునాది వేసిందని పేర్కొన్నారు. బెల్లి లలిత లాంటి అద్భుత కళాకారులను మరసం వెలుగులోకి తీసుకొచ్చిందని గుర్తుచేశారు.



# జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక కేంద్ర చట్టాన్ని తేవాలి

### జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డులు ఇవ్వాలి

### టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** భారతదేశంలో జర్నలిస్టులకు రోజురోజుకు రక్షణ లేకుండా పోతుందని, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక కేంద్ర చట్టాన్ని తేవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే- ఐజేయు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జర్నలిస్టు డిమాండ్స్ డే లో భాగంగా శుక్రవారం టి యు డబ్ల్యు జే జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌక్, వివేకానంద చౌక్, మీదుగా గాంధీ చౌక్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గాంధీ చౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో జీవితాలు గడుపుతున్నారని అనేక మంది ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతన వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొత్త లేబర్ కోడ్‌లలో రద్దయిన వర్కింగ్ జర్నలిస్ట్ చట్టబద్ధ హక్కులను పునరుద్ధరించాలని కోరారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం తమ ఎన్నికల హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు అందించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి అడపా సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, చంద్రకాంత్, నవీన్ గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎస్ వేణుగోపాల్, వారణాసి శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు ,జర్నలిస్టులు అహ్మద్ పాషా, నరేందర్, షేక్ జమీల్, మేకల శ్రీనివాస్, సురేష్ చారి, అబ్దుల్ హన్నన్, రాధాకృష్ణ చారి, మోహన్, భాస్కరాచారి, శ్రీధర్, నరేష్, పోచయ్య, డోంగ్రి రవీందర్, దూడల గోపి, కే సురేష్, రమేష్ రాథోడ్, సృజన్, నితేష్, రవి, రాజు, సయ్యద్ సోజర్, వినోద్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.




